

www.vibharenews.com

విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గుంటూరురాష్ట్ర వ్యాప్తంగా కర్ఫ్యూ విధించడానికి ప్రభుత్వం జీవో 192ను విడుదల చేసిందని గుంటూరు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ తెలిపారు.ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కర్ఫ్యూ విధించడం లేదని, ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వ్యాపారాల కు ,వాహనాలకు అనుమతి ఉంటుందని,ఎవరికైనా కర్ఫ్యు ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.విద్యుత్,శీతల గిడ్డంగులు, మెడికల్ లాంటి వాటికి అత్యవసర సేవలకు మినహాయింపు ఇస్తున్నామని, తెలంగాణ నుంచి వచ్చే వాహనాలకు ఉదయం 6 మధ్యాహ్నం12గంటలవరకు అనుమతి ఉంటుందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ విశాల్ గున్నీ తెలిపారు.ప్రజలు అందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కర్ఫ్యూ సహకరించాలని,కరోనా నివారించడానికి రాష్ట్ర సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉన్నామని,ప్రభుత్వం విధించిన జీవో ప్రకారం రాష్ట్ర సరిహద్దుల్లో అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని ఎస్పీ విశాల్ గున్నీ తెలిపారు

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 06 మే 2021 సంపుటి : 02 సంచిక : 295 పేజీలు : 4 వెల : రూ 3-00

# ఏపీలో అమల్లోకి వచ్చిన కర్ఫ్యూ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కర్ఫ్యూ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రజారోగ్యం దృష్ట్యా ఏపీ ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. నేటి నుంచి రెండు వారాల పాటు మధ్యాహ్నం 12 తర్వాత కర్ఫ్యూ అమలు కానుంది.. మధ్యాహ్నం 12 గంటల నుంచి తర్వాతి రోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుంది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకే షాపులకు అనుమతి ఉంటుంది. కర్ఫ్యూ ఈనెల 18 వరకు కొనసాగనుంది. కర్ఫ్యూ నుంచి అత్యవసర సేవలకు మినహాయింపు ప్రకటించింది. కర్ఫ్యూకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.అయితే కర్ఫ్యూ నుంచి కొన్నింటికి మినహాయింపులు ప్రకటించింది. రాష్ట్రంలో బ్యాంక్ సేవలు యథాతథంగా కొనసాగనున్నాయి. బ్యాంక్ సేవలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు ఇచ్చింది. అలాగే జాతీయ రహదారుల పనులు కొనసాగించేందుకు అనుమతి ఉంది.పోర్టుల్లో కార్యకలాపాల నిర్వహణకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.కాగా రోనా కట్టడి చర్యల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కర్ఫ్యూను అతిక్రమించి రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి. గుమిగూడడం, సమావేశాలు నిర్వహించడం వంటి వి పూర్తిగా నిషేధం. ఉదయం 6 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆ తరువాత కర్ఫ్యూ అమలవుతుంది. ఆ సమయంలో ఆటోలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలపై కూడా నిషేధం ఉంది. 12 గంటల తరువాత ఆటోలు రోడ్ల పైకి వస్తే సీజ్ చేస్తా మని ప్రభుత్వం ప్రకటించింది.అత్యవసర సేవల వాహనాలను మాత్రం అనుమతించనున్నారు. అలాగే మీడియా వంటి అత్యవసర ఉద్యోగులకు మినహాయింపు ఉంటుంది. ఉదయం పూట షాపులు తెరిచే సమయంలో వాహనాల రాకపోకలకు అనుమతి ఉంది. ఆ సమయంలో గుంపులు గుంపులుగా షాపింగ్‌లు చేయకూడదు. ఈ ఆంక్షలు రెండు వారాలు కొనసాగుతాయి. ఇప్పటికే ప్రభుత్వం రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకూ కర్ఫ్యూ విధిస్తోంది.కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా ఇప్పటికే జనం స్వచ్ఛందంగా స్వీయ ఆంక్షలు అమలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్లు, పాలు, ఇతర నిత్యావసర సరకుల దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలను మంగళవారం వరకూ సాయంత్రం 6 గంటలకే మూసివేస్తున్నారు. కొన్నిచోట్ల పగలు 12 గంటల తరువాత కొంతవరకూ స్వచ్ఛంద ఆంక్షలు విధించుకోవడంతో సాయంత్రం తర్వాత పట్టణాల్లో జనసంచారం తగ్గుతోంది. మధ్యాహ్నం నుంచి మర్నాడు ఉదయం వరకూ కర్ఫ్యూ విధిస్తే కరోనా వ్యాప్తి తగ్గే అవకాశాలున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

# ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎక్కడా జాప్యం చేయకూడదు: సీఎం జగన్



తాడేపల్లి : జూన్ 1 నుంచి జగనన్న కాలనీల్లో పనులు ప్రారంభించాలని, ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎక్కడా జాప్యం చేయకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కోవిడ్ సమయంలో ఇళ్ల నిర్మాణం వల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని, కార్మికులకు పని దొరుకుతుందని చెప్పారు. స్టీల్, సిమెంట్..ఇతర మెటీరియల్ కొనుగోలుతో వ్యాపార లావాదేవీలు జరుగుతాయన్నారు. బుధవారం 'నవరత్నాలు?పేదలందరికీ ఇళ్లు' పై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జగనన్న కాలనీలలో జూన్ 1న పనులు ప్రారంభించాలి. ఆ మేరకు ఈనెల 25 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి. కర్ఫ్యూ ఉన్నప్పటికీ ఆ పనులేవీ ఆగకూడదు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యథావిధిగా కార్యకలాపాలు. ఇళ్ల నిర్మాణానికి నీరు, విద్యుత్ అవసరం కాబట్టి, వెంటనే ఆ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలి.ప్రతి లేఅవుట్‌లో తప్పనిసరిగా ఒక మోడల్ హౌజ్ నిర్మించాలి. ఆ తర్వాత దానిపై సమగ్ర నివేదిక కూడా తెప్పించుకోవాలి. ఎక్కడైనా నిర్మాణ వ్యయం అంచనాను మించి పోయిందా? ఇంకా ఎక్కడైనా వ్యయాన్ని నియంత్రించవచ్చా? ఇంకా బాగా ఇంటి నిర్మాణం ఎలా చేయొచ్చు.. వంటి అంశాలను ఆ నివేదిక ఆధారంగా సమీక్షించాలి.కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో స్టీల్ వినియోగం తగ్గుతుంది. దాని వల్ల రేట్లలో తేడా వచ్చే వీలుంది. నిజానికి స్టీల్ ఫ్యాక్టరీలు తమ ఉత్పత్తిలో భాగంగానే, ఆక్సీజన్‌ను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. కాబట్టి ఉత్పత్తి ఆగదు. మనకు 7.50 లక్షల టన్నుల స్టీల్ కావాలి. కాబట్టి స్టీల్ కంపెనీలతో ప్రత్యేకంగా మాట్లాడండి. ఎవరైనా సొంతంగా ఇల్లు నిర్మించుకుంటామంటే అస్సలు కాదనవద్దు. వారికి కావాల్సిన మెటీరియల్ తప్పనిసరిగా అందించాలి. కేవలం ఇళ్లు నిర్మించడమే కాదు, అక్కడ తగిన మౌలిక వసతులు కల్పించాలి. అలాగే లేఅవుట్ కూడా పక్కాగా ఉండాలి. సీసీ రోడ్డు, భూగర్భ సీసీ డ్రెయిన్లు, నీటి సరఫరా (జెజెఎం), విద్యుద్దీకరణ, ఇంటర్నెట్.. మౌలిక వసతుల్లో ముఖ్య కాంపోనెంట్స్. కరెంటు, నీటి సరఫరాతో పాటు, రోడ్లు కూడా నిర్మించాలి. అవి లేకపోతే ఆ ఇళ్లలోకి ఎవరూ రారు.కోవిడ్ సమయంలో ఈ ఇళ్ల నిర్మాణం ఆర్థిక వృద్ధికి దోహదం చేయనుంది. ఎందుకంటే కార్మికులకు పని దొరుకుతుంది. అలాగే స్టీల్, సిమెంట్, ఇతర మెటేరియల్ కొనుగోలు వల్ల వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. కాబట్టి దీనికి చాలా ప్రయారిటీ ఇవ్వాలి. ఇళ్ల నిర్మాణంలో లెవెలింగ్ అన్నది చాలా ముఖ్యం. దాదాపు 1.95 లక్షల ప్లాట్లకు ఈ సమస్య ఉంది. భవిష్యత్తులో అంతా భూగర్భ కేబుల్ వ్యవస్థదే. ఒక్కసారి వేసిన తర్వాత పెద్దగా సమస్యలు కూడా ఉండవు. నీటి పైప్‌లైన్లు, విద్యుత్ కేబుళ్లు, ఇతర కేబుళ్లు కూడా భవిష్యత్తులో పూర్తిగా భూగర్భంలోనే వేయబోతున్నారు. అయితే ఆ పనులు చేసేటప్పుడు లోతు, నీరు, విద్యుత్, ఇంటర్నెట్ కేబుళ్ల మధ్య దూరం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త పడాలి.జగనన్న కాలనీ లేఅవుట్లలో సీసీ రోడ్లు, నీటి సరఫరా, విద్యుద్దీకరణ, భూగర్భ ఇంటర్నెట్, క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పనులు. అయితే ఇవన్నీ వేర్వేరు శాఖల పరిధిలో ఉన్నాయి. కాబట్టి ఒకే ఏజెన్సీకి అన్ని పనులు అప్పగించాలి. ఆ మేరకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించండి. పనుల్లో డూప్లికేషన్ ఉండకూడదు, అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించండిఈ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం కాబట్టి, కేంద్రం నుంచి అదనంగా నిధులు కోరుదాం. టిడ్కో ఇళ్ల నిర్మాణంలో కేంద్రం ఎలాగూ వాటా ఇస్తోంది. ప్రభుత్వం ఇంత పెద్ద స్థాయిలో ఇళు నిర్మిస్తుంది కాబట్టి, అదనపు నిధుల కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేద్దాం. ఇంకా, టిడ్కో ఇళ్లపై పెయింటింగ్స్ తప్పనిసరిగా వేయాలి. వాటిని అన్ని వసతులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.

## మరాఠా రిజర్వేషన్లు రద్దు చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : మరాఠా రిజర్వేషన్లపై బుధవారం సుప్రీం కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. రిజర్వేషన్లు రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలోని మరాఠా సంఘం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడింది. ఆర్థిక, సామాజిక వెనుకబాటు తనం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వబడ్డాయని, 50 శాతానికి రిజర్వేషన్లు మించితే సమానత్వపు హక్కు ఉల్లంఘించినట్టేనని కోర్టు పేర్కొంది. 1992 మండల్ తీర్పులో సుప్రీంకోర్టు విధించిన రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని పునః



సమీక్షించాల్సిన అవసరం లేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పీజీ మెడికల్ కోర్సుల్లో కొత్త రిజర్వేషన్ల చట్టం మేరకు ఇప్పటికే చేపట్టిన ప్రవేశాలు కొనసాగుతాయని తెలిపింది. గతంలో జరిగిన అన్ని నియామకాలకు ఎలాంటి ఇబ్బంది లేదని వివరించింది.విద్య, సామాజికపరంగా వెనుకబడిన వర్గంగా మరాఠా సామాజిక వర్గాన్ని గుర్తిస్తూ 2018లో మహారాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్లు ఏర్పాటు చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చింది. దీనిపై బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలవగా.. కోర్టు చట్టాన్ని సమర్థించింది. అయితే, బాంబే హైకోర్టు 16 శాతం రిజర్వేషన్ సరైంది కాదని, మరాఠాల కోటా ఉద్యోగాల్లో 12 శాతం మించరాదని, అడ్మిషన్లలో 13 శాతం మించొద్దంటూ 2019లో తీర్పునిచ్చింది. ఈ క్రమంలో రిజర్వేషన్లపై బాంబే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. రిజర్వేషన్లపై కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా.. సమర్థించింది. రాజ్యాంగానికి లోబడే రిజర్వేషన్లు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సామాజికంగా, విద్యా పరంగా వెనకబడినవారిని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని పేర్కొంది. కేసులో ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మార్చి 26న తీర్పు రిజర్వు చేయగా.. మరాఠా రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టివేస్తూ బుధవారం తీర్పును వెలువరించింది.

## టీకా వృథా తగ్గేలా చేస్తున్న కేరళకు ప్రధాని ప్రశంసలు

న్యూ ఢిల్లీ: టీకా వృథాను తగ్గించేలా చేస్తున్న కేరళ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రశంసించారు. వ్యాక్సిన్ వృథాలను తగ్గించడంలో కేరళ ప్రభుత్వం ఘణనీయంగా కృషి చేయడం వల్లనే అందరికీ డోసులు అందుతున్నాయని మోదీ చెప్పారు. కొవిడ్‌-19 కు వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడంలో ఇది ముఖ్యమని అన్నారు.'వ్యాక్సిన్ల వృర్థాన్ని తగ్గించడంలో మన ముందు ఉదాహరణగా నిలిచిన కేరళ ఆరోగ్య కార్యకర్తలు, నర్సుల కృషిని చూస్తే చాలా ఆనందంగా ఉన్నదని, కొవిడ్‌-19 కు వ్యతిరేకంగా



జరుపుతున్న పోరాటానికి ఇది అవసరం' అని కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌ను మోదీ కొనియాడారు.రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాక్సిన్ వృథా చేసిన గణాంకాల మేరకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చాలా జాగ్రత్తగా టీకా పనులు చేపట్టారని మోదీ ట్వీట్ చేశారు. 'కేరళకు కేంద్ర ప్రభుత్వం నుంచి 73,38,806 మోతాదుల వ్యాక్సిన్ వచ్చింది. ప్రతి సీసాలో వృథాగా మిగిలిన అదనపు మోతాదును ఉపయోగించి 74,26,164 డోసులను అందించగలిగాం. ఆరోగ్య కార్యకర్తలు, ముఖ్యంగా నర్సులు ఇలాంటి శుభతరుణంలో ప్రశంసించేదుకు పూర్తి అర్హులే' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.ఇప్పటివరకు 17.02 కోట్లకు పైగా కొవిడ్‌-19 వ్యాక్సిన్ మోతాదులను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందించామని, వచ్చే మూడు రోజుల్లో వారికి 36 లక్షలకు పైగా డోసులను అందిస్తామని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

## అమూల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా జగన్: అచ్చెన్న


అమరావతి: సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమూల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా జగన్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. ఏపీ డైయిరీకి చెందిన ఆస్తులను అమూల్‌కు కట్టబెట్టడంలోనే కుట్ర బహిర్గతమైందని తెలిపారు. గుజరాత్ సంస్థ కోసం సంగం డైరీ రైతులను బలి తీసుకున్నారని మండిపడ్డారు. తెలుగు భాషపై, తెలుగువారి డైయిరీపై ముఖ్యమంత్రికి నమ్మకం లేదా అని ప్రశ్నించారు. ఏపీలో డైయిరీలను చంపేందుకు జగన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అమూల్‌కు పాలు రాకపోవడంతో కక్షగట్టారన్నారు. బాగా నడుస్తున్న వ్యవస్థను విధ్వంసం చేయడం ఏవిధంగా న్యాయమని నిలదీశారు. అమూల్‌కు పాలుపోస్తేనే సంక్షేమ పథకాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలపై కక్ష సాధింపుల కోసం డెయిరీ రంగాన్నే నిర్వీర్యం చేస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు.

## పిశాచాల కంటే క్రూరంగా తండ్రీకొడుకుల ఆలోచనలు



అమరావతి: కరోనా విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేశ్‌పై ట్విటర్ వేదికగా వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరుపై మండిపడ్డారు. పిశాచాల కంటే క్రూరాతి క్రూరంగా వారి ఆలోచనలు ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కరోనా నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్ర కేబినెట్ సమావేశంపై పలు కీలక నిర్ణయాలు తీసుకుందని ఎంపీ విజయసాయిరెడ్డి గుర్తుచేశారు.ఇదే క్రమంలో బాబు, లోకేశ్ చేస్తున్న విమర్శలపై కొన్ని ట్వీట్లు చేశారు. 'రాష్ట్ర ప్రజలు క్షేమంగా ఉండాలని తండ్రీ కొడుకులు ఎన్నడూ కోరుకోరు. జగన్ గారు విఫలమయ్యారని ఏడవడానికి, దేశమంతా మహమ్మారి అదుపులోకి వచ్చినా ఏపీలో మాత్రం శవాల దిబ్బలు కనిపించాలని 'వాళ్ల దేవుళ్లకు' మొక్కుతుంటారు. పిశాచాల కంటే క్రూరాతి క్రూరంగా ఉంటాయి వీళ్ల ఆలోచనలు.' అని ట్వీట్ చేశారు. 'పాపాలు చేసిన వారిని దేవుడు క్షమిస్తాడేమో కానీ తమను నిలువునా దోచుకుని, మాఫియా పాలనతో పీడించిన బాబులాంటి వారిని ప్రజలు అస్సలు మన్నించరు. వరుస పరాజయాలు అందుకే. నిజాయతీ విలువ తెలియని వ్యక్తులు పరాజయాల భారం కింద నలిగిపోక తప్పదు' మరో ట్వీట్ చేశారు.

## కేబినెట్ భేటీలో కరోనాకు ప్రాధాన్యమివ్వరా? చంద్రబాబు ఫైర్



హైదరాబాద్: వ్యాక్సినేషన్ విషయంలో జగన్ ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. ప్రజల ప్రాణాలు కాపాడటంలో జగన్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం జూమ్ ద్వారా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాన్ని విమర్శించడం తమ పని కాదని, కానీ ఆవేదనతోనే మాట్లాడతున్నామని వ్యాఖ్యానించారు.కర్నూలు జిల్లాలో పుట్టిన ఎన్‌-440 వేరియంట్ ఆందోళన కలిగిస్తోందని చంద్రబాబు అన్నారు. ఏపీ నుంచి వస్తున్న కొత్త స్ట్రెయిన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ హైకోర్టు కూడా హెచ్చరించిందని గుర్తు చేశారు. బెడ్లు, వెంటిలేటర్ల కొరత లేదని ఏపీ ప్రభుత్వం మాట్లాడుతోందని, ప్రభుత్వ వైఖరితో బాధ కలిగే పొలిట్‌బ్యూరో సమావేశం పెట్టామని తెలిపారు. అతి తీవ్రమైన కరోనాకు కేబినెట్ భేటీలో ప్రాధాన్యత లేదని మండిపడ్డారు.కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉందని, కరోనా రోగులకు తమ పార్టీ తరపున సాయం అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు నిషేధాజ్ఞలు అమలవుతున్నాయని, ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిపై ఉందని గుర్తు చేశారు.

# సంపాదకీయం

గురువారం 06 మే 2021

## జాతీయ పార్టీలకు డేంజర్ బెల్స్

తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీలకు కనువిప్పు. పార్టీకి సర్వం సహా తామై పోయిన మోడీ, అమిత్ షా ద్వయానికి ఓటర్లు మొట్టికాయ వేశారు. సైద్ధాంతిక నిబద్ధతకు నీళ్లొదిలి ఎంతకైనా దిగజారిన కాంగ్రెసు, కమ్యూనిస్టులకు కన్నీళ్లు మిగిల్చారు. అసోం, పుదుచ్చేరి వంటి చోట్ల ఎన్డీఏ గెలిచినా అది కంటి తుడుపే. కేరళలో కమ్యూనిస్టు విజయమూ నిజానికి పార్టీ సక్సెస్ కాదు. ఉక్కు మనిషి విజయన్ సంకల్పమే దానికి కారణం. ఏతావాతా ఎన్నికల ఫలితాలు ముందుగా అనుకున్నట్లుగానే వచ్చినా బెంగాల్ ఫలితం మాత్రం జాతీయ పార్టీలకు ఒక చక్కటి గుణపాఠం. సమాఖ్య వ్యవస్థలో ప్రాంతీయ పార్టీలు ఎందుకు పుట్టుకుని వస్తున్నాయి. వాటికి జనాదరణ ఎందుకు లభిస్తోందనే దానికి సమాధానంగా ఈ ఎన్నికలను చూడాలి. రాష్ట్రస్థాయిలో బలమైన నాయకులను ఎదగనీయకుండా , చక్రం తిప్పాలనుకుంటే జాతీయ పార్టీలు మట్టిగొట్టుకుపోవడం తథ్యం.పశ్చిమ బెంగాల్ పరాజయం మోడీ, అమిత్ షా లదే. అందులో ఎవరికీ సందేహం లేదు. సంశయాలు కూడా లేవు. మీడియా వార్తలు, సర్వేలు, ఎన్నికల కమిషన్ కఠిన వైఖరుల రూపంలో పోటాపోటీ వాతావరణాన్ని బీజేపీ అగ్రనాయకద్వయం సృష్టించగలిగింది. కానీ ఓటర్ల మనసును గెలుచుకోలేకపోయారు. అందులోనూ అనూహ్యంగా మూడింట రెండువంతుల ఆధిక్యంతో మమత బెనర్జీ గెలవడం మోడీ, షా లకు తలకొట్టేసినట్లే. జాతీయ వాద బావనను బీజేపీ బెంగాల్ లో బాగానే ప్రేరేపించగలిగింది. కానీ అదే సమయంలో బీజేపీ మరిచిపోయిన మరో ముఖ్య అంశం ఉంది. జాతీయ వాదాన్ని ఎంతగా అక్కున చేర్చుకుంటారో అంతగానూ విభజన వాదాన్ని బెంగాల్ ప్రజలు వ్యతిరేకిస్తారు. 20 వశతాబ్దం తొలినాళ్లలో బెంగాల్ ను బ్రిటిష్ పాలకులు విభజించినప్పుడు అందుకు వ్యతిరేకంగా వందే మాతరం ఉద్యమం పురుడు పోసుకున్నది ఆ గడ్డపైనే. స్వాభిమానం ఎక్కువగా కనిపిస్తుంది. తమ మూలాలపట్ల గౌరవం కూడా అక్కడి ప్రజల్లో అధికం. మోడీ, అమిత్ షాలు అంతా తామే కాకుండా ప్రత్యామ్నాయం ఆలోచించి జాతీయ వాదానికి , ప్రాంతీయ నేతలను జోడించి ఉండాల్సింది. స్థానికంగా ఒక బలమైన నాయకుడిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిలబెట్టి ఉంటే బాగుండేది. తమను చూసే ప్రజలు ఓట్లు వేయాలని వారిద్దరూ భావించారు. పట్టం గడతారని భ్రమించారు. వారి ఆలోచనలను బెంగాలీ ఓటరు తిప్పికొట్టారు. ఆ మట్టిపైనే పుట్టి పెరిగిన మమతను మరోసారి ఆశీర్వదించారు. శషభిషలకు తావు లేకుండా, బేరసారాలకు , సందిగ్ధానికి ఆస్కారం ఇవ్వకుండా బంపర్ మెజార్టీతో గెలిపించారు.కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు దివాలాకోరు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయాయి. బెంగాల్ లో తమకెలాగూ గెలుపు దక్కదని తెలుసు. బీజేపీ, తృణమూల్ మధ్య పోటాపోటీ వాతావరణం ఉంది. అటువంటప్పుడు వచ్చేదీ , పోయేదీ లేదు. రాష్ట్రానికొక విధానంతో గందరగోళ పడుతున్నారు. బెంగాల్ లో చేతులు కలిపి పోరాడుతున్నారు. కేరళలో కాంగ్రెసు, కమ్యూనిస్టుల మధ్య ముఖాముఖి పోటీ. పొత్తుపై చర్చకు తావు లేకుండా లౌకిక వాదం విషయంలో రాజీ పడటం లేదని కమ్యూనిస్టు నాయకులు సర్ది చెబుతూ వచ్చారు. బీజేపీ మతవాద అజెండాను ఎదిరించడానికే ఇదంతా అంటూ చెప్పుకొచ్చారు. కానీ సిద్ధిఖీ వంటి తీవ్రమైన మత బావనలున్న వ్యక్తి తో, ఆ పార్టీతో చేతులు కలిపారు. ఇకపై లౌకిక పార్టీలుగా తమను తాము క్లెయిం చేసుకునే అర్హతను కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు కోల్పోయాయి. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు. పైపెచ్చు ఈ ఫలితం భవిష్యత్తులోనూ వెంటాడుతుంది.పార్టీల అగ్ర నాయకులని ప్రజలు తమ ఆత్మాభిమానానికి ప్రతీకగా భావిస్తున్నారు. జాతీయ పార్టీలలో సైతం స్థానిక నాయకులు బలంగా ఉన్నప్పుడు ఆదరిస్తున్నారు. జాతీయ నేతలను చూసి శాసనసభ ఎన్నికల్లోనూ ఓటు వేయమంటే తిరస్కరిస్తున్నారు. కేరళలో పినరయి విజయన్ విజయమే తప్ప సీపీఎం విజయం కాదని కార్యకర్తలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. తమిళనాడులో ఆ మేరకైనా డీఎంకెకు ఏఐఏడీఎంకె పోటీ ఇవ్వగలిగిందంటే ఆ పార్టీకి ఉన్న నాయకత్వమే కారణం. అందువల్ల జాతీయ పార్టీలు శాసనసభ , స్థానిక ఎన్నికల్లో నిలదొక్కుకోవాలంటే ప్రాంతీయ నాయకులకు స్వేచ్ఛ ఇవ్వాలి. ఆయా రాష్ట్రాలకు సంబంధించి సర్వం సహావారే నాయకులని చెప్పగలగాలి. తమ పార్టీలకు లోకల్ బ్రాండ్ లుగా నాయకులను తయారు చేసుకోవాలి. మోడీ గుజరాత్ లో ఆవిధంగా ఎదిగిన వ్యక్తే. శివరాజ్ సింగ్ చౌహాన్, యడియూరప్ప వంటి వారూ తమ పార్టీలకు గెలుపు సాధించి పెట్టారు. జీ హుజూర్ నేతలతోనే జాతీయ పార్టీలు రాష్ట్రాలను శాసించాలనుకుంటే ప్రజలు తిరస్కరిస్తారు. ఈ నిజాన్ని ఇప్పటికైనా గ్రహించకపోతే జాతీయ పార్టీలు పెద్ద పరిమాణంలోని ప్రాంతీయపార్టీలుగా మిగిలిపోతాయి.

# మే నెలలో మహనీయుల జయంతులు

తిరుమల, మే 05 వైశాఖ మాసం (మే నెలలో)లో శ్రీ నరసింహస్వామివారి జయంతితోపాటు, శ్రీవారి భక్తాగ్రగణ్యులైన శ్రీ త్యాగరాజస్వామి, శ్రీ తాళ్లపాక అన్నమయ్య, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతులను ధర్మప్రచారంలో భాగంగా టిటిడి నిర్వహిస్తోంది. కోవిడ్ -19 వ్యాప్తి నేపథ్యంలో ఈ జయంతి ఉత్సవాలను ఏకాంతంగా నిర్వహిస్తారు.శ్రీ త్యాగరాజస్వామి శ్రీ త్యాగరాజస్వామివారి జయంతిని మే 17వ తేదీన నిర్వహిస్తారు. వీరు 1767వ సంవత్సరంలో జన్మించారు. వీరి వంశీయులు ప్రకాశం జిల్లా కాకర్ల గ్రామానికి చెందినవారు. యుక్త వయసులో త్యాగయ్య భక్తి, జ్ఞాన, వైరాగ్యాలకు సంతోషించిన నారద మహర్షి స్వయంగా స్వరార్ణవం అనే సంగీత గ్రంథాన్ని ఇచ్చి ఆశీర్వదించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. సంగీత జగద్గురువుగా వినుతికెక్కిన త్యాగయ్య దాదాపు 180 సంవత్సరాల క్రితం తిరువయ్యార్ నుంచి తిరుమల క్షేత్రానికి విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈయన 1847వ సంవత్సరంలో పరమపదించారు. ఇంతటి గొప్పచరిత్ర గల త్యాగయ్య వర్ధంతి ఆరాధనోత్సవాలను తిరువయ్యూరులో ప్రతి ఏటా పుష్యబహుళ పంచమినాడు నిర్వహిస్తారు. త్యాగయ్య జయంతి వైశాఖ శుద్ధ షష్ఠి మే 17వ తేదీన వారి జన్మస్థలమైన ప్రకాశం జిల్లా కాకర్లలో నిర్వహిస్తారు.శ్రీ తాళ్లపాక అన్నమయ్య తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని కీర్తిస్తూ 32 వేల కీర్తనలు రచించిన వాగ్గేయకారుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు. వీరు తొలి తెలుగు వాగ్గేయకారుడిగా, పదకవితా పితామహుడుగా ప్రఖ్యాతి పొందారు. అన్నమయ్య జయంతిని మే 25న తిరుపతి అన్నమాచార్య కళామందిరం, తాళ్లపాకలోని ధ్యానమందిరంలో నిర్వహిస్తారు. అదేరోజున తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీనరసింహ జయంతి ఉత్సవం జరుగనుంది.మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ శ్రీవారిపై అచంచలమైన భక్తివిశ్వాసాలు కలిగిన శ్రీ తరిగొండ వెంగమాంబ 1730వ సంవత్సరంలో జన్మించారు. శ్రీ రాఘవేంద్రస్వామి, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి లాగా తన బృందావనంలోనే 1817లో సజీవ సమాధి చెందారు. తిరుమలలో అన్నదానాన్ని ప్రారంభించినందుకు గుర్తుగా వెంగమాంబ పేరు ముందు మాతృశ్రీ అనే పదం చేరింది. టిటిడి ప్రతి ఏడాదీ వెంగమాంబ జయంతిని క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. వెంగమాంబ జయంతిని మే 25వ తేదీన తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో, తిరుమల వెంగమాంబ బృందావనంలో ఏకాంతంగా నిర్వహిస్తారు.

## కర్ఫ్యూ సమయంలో అత్యవసర సేవల వాహనాల కు మాత్రమే అనుమతి

### జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

మంత్రాలయం కరోనా వైరస్ వ్యాప్తి అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుదవారం నుండి రెండు వారాల పాటు మధ్యాహ్నం 12 గంటల నుంచి మరుసటి దినం 6 గంటల వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటున్న నేపథ్యంలో బుధవారం కర్నూలు జిల్లా సరిహద్దులో ఉన్న మాధవరం చెక్ పోస్టును జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆకస్మిక తనిఖీ చేసి కర్ఫ్యూ అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలు ,అన్నీ గ్రామాలలో కర్ఫ్యూ ను పటిష్టంగా అమలు పరచాలన్నారు.పోలీసు అధికారులు, సిబ్బంది కర్ఫ్యూ సమయంలో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టులలో అనుమతుల మేరకే అత్యవసర వాహనాలను అనుమతించాలన్నారు. ఇతర వాహనాలను అనుమతించకూడదన్నారు. అనవసరంగా ప్రజలు బయట తిరగకుండా పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీతో పాటు ఆదోని డిఎస్పీ వినోద్ కుమార్ , మంత్రాలయం సిఐ. క్రిష్ణయ్య, మాధవరం ఎస్సై టి. బాబు, ఎస్ ఈ బి సిఐ మోహిద్దీన్, సిబ్బంది ఉన్నారు.

# అయ్యన్నా... లెక్కేంటీ...

విశాఖపట్టణం, మే 5, (న్యూస్ పల్స్)తెలుగుదేశంలో రాజకీయ పరిణామాలు చూస్తూంటే ఒక్కోసారి కాంగ్రెస్ పార్టీ గుర్తుకువస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే నాయకులు. టీడీపీలో ఏక నాయకత్వం ఉంటుంది. పైగా క్రమశిక్షణ కలిగిన పార్టీగా కూడా చెప్పుకుంటారు. పై స్థాయిలో ఒక మాట చెబితే కిక్కురుమనకుండా దిగువ స్థాయి దాకా అమలు చేసే విధేయత ఆ పార్టీకే చెల్లు. కానీ ఇటీవల కాలంలో మాత్రం టీడీపీలో కూడా కాంగ్రెస్ పోకడలు గట్టిగానే కనిపిస్తున్నాయి. పరిషత్ ఎన్నికలను బాయ్ కాట్ చేస్తున్నామని సాక్షాత్తూ చంద్రబాబే గట్టిగా చెప్పినా తమ్ముళ్ళు ధిక్కరించి మరీ బరిలో నిలిచారు. ఇలాంటి ఉదాహరణలు ఈ మధ్య చాలానే కనిపిస్తున్నాయి తెలుగుదేశం పార్టీలో ఎవరు ఏ పదవిలో ఉన్నా సూపర్ బాస్ చంద్రబాబే. అయితే విధేయుడుగా ఉంటారనుకుని బీసీ నేత అయిన అచ్చెన్నాయుడిని ఏరి కోరి మరీ బాబు ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ గా ప్రకటించారు. చిత్రంగా అదే అచ్చెన్న నోటి నుంచి పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు వచ్చాయి. పైగా భావి వారసుడు లోకేష్ మీద కూడా అచ్చెన్న చేసిన కామెంట్స్ తో అధినాయకత్వానికి దిమ్మతిరిగిపోయింది. అయితే అచ్చెన్న మీద సీరియస్ యాక్షన్ ఉంటుందా అంటే చెప్పలేం అని అంటున్నారు కానీ ఉండదు అని ఎవరూ అనలేకపోతున్నారు. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు కాబట్టి సరైన సమయంలోనే కీలక నిర్ణయం తీసుకుంటారు అంటున్నారు.గతసారి టీడీపీ ప్రెసిడెంట్ పదవికి తానే అర్హుడిని అని అయ్యన్నపాత్రుడు భావించారు. తనకు ఆ పదవి ఇస్తారని కూడా ఎంతగానో ఊహించారు. కానీ నాడు జగన్ సర్కార్ అచ్చెన్న మీద కేసులు పెట్టి అరెస్ట్ చేయడంతో ఒక్కసారిగా హైలెట్ అయ్యారు. దాన్ని సొమ్ము చేసుకోవడానికి చంద్రబాబు ఆయనకు పదవి అప్పచెప్పారు. అయితే అచ్చెన్న వల్ల ఉత్తరాంధ్రాలో పార్టీకి విజయాలు దక్కలేదు సరికదా లోకల్ బాడీ ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు వచ్చాయి. దానికి తోడు అచ్చెన్న సొంతంగా ముందుకు సాగే నైజం కూడా అధినాయకత్వానికి చికాకు పెడుతోంది. పైగా లోకేష్ కి మొదటి నుంచి అచ్చెన్న నియామకం ఇష్టం లేదు అన్న ప్రచారం కూడా ఉంది. ఈ మొత్తం వ్యవహారాన్ని చూసిన మీదట ఈసారి తనకు ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ పదవి ఖాయమని అయ్యన్నపాత్రుడు భావిస్తున్నట్లుగా ఉందిట.ఏనాడూ చంద్రబాబు కూడా జగన్ మీద ఇంత దారుణంగా కామెంట్స్ చేయలేదు. కానీ అయ్యన్నపాత్రుడు ఎపుడూ జగన్ మీద హార్ష్ గానే విమర్శలు చేస్తున్నారు. తాజాగా ఆయన పిచ్చోడి పాలన అంటూ జగన్ ని కడిగిపారేశారు. ఇక ప్రతీ రోజూ జగన్ మీద హాట్ కామెంట్స్ చేస్తూ ఏపీ రాజకీయాల్లోనే అలజడి రేపుతున్నారు. దీని వెనక వేరే ఉద్దేశ్యాలు ఉన్నాయని అంటున్నారు. తాను కనుక పార్టీ ప్రెసిడెంట్ అయితే ఇంతకు పదింతలు జగన్ని ఎదిరించి పార్టీని పటిష్టం చేస్తాను అన్న సిగ్నల్స్ ని అయ్యన్నపాత్రుడు చంద్రబాబుకే డైరెక్ట్ గా పంపుతున్నారు అంటున్నారు. పైగా అయ్యన్నకు మరో ప్లస్ పాయింట్ కూడా ఉంది. ఆయన లోకేష్ కి అత్యంత సన్నిహితుడు. లోకేష్ ఎలా చెబితే అలా అన్నట్లుగా అయ్యన్న వ్యవహరిస్తారు. దీంతో లోకేష్ చూపు కూడా అయ్యన్న మీద పడే అవకాశం ఉంది అంటున్నారు. ఇక అచ్చెన్న, అయ్యన్న ఒకే సామాజిక వర్గం. సో అచ్చెన్నను అయ్యన్నతో రీప్లేస్ చేసినా ఏ ముప్పు రాదు, ఏ తప్పూ లేదు అన్న ఫీలింగ్ అయితే హై కమాండ్ కి ఉంది అంటున్నారు.


# అతి ధీమా కొంపముంచుతుందేమో

విజయవాడ, మే 5, (న్యూస్ పల్స్)పి కూడా ఎక్కువ తింటే చేదుగా మారుతుంది. అలాగే విజయాలు కూడా ఒక మోతాదుని మించితే తలకెక్కి మెదడు బరువెక్కుతుంది. అపుడు మత్తు ఆవహించి సరైన ఆలోచనలు మరుగున పడిపోతాయి. ఇపుడు వైసీపీకి దక్కుతున్న విజయాలు కూడా అలాంటి ప్రమాదాన్ని తెచ్చిపెడతాయా అన్న చర్చ అయితే పార్టీలో జరుగుతోంది. నిజానికి జగన్ దూకుడు తగ్గాలి అంటే ప్రజా తీర్పు కొంత చెక్ పాయింట్ అవుతుంది అని అంతా అనుకున్నారు. కానీ లోకల్ బాడీ ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు దక్కడం, జగన్ వేవ్ ఏపీలో ఇంకా బలంగా ఉండడం చూసి సొంత పార్టీ నేతలే షాక్ తిన్నారని టాక్.ఇపుడు ఏపీలో విపక్షం గతంలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉందనే చెప్పాలి. వైఎస్సార్ హయాంలో కేవలం 47 సీట్లు వచ్చినా కూడా చంద్రబాబు అల్లల్లాడించారు. అదే సమయంలోలో లోకల్ బాడీ ఎన్నికలు జరిగితే పట్టున్న చోట్ల టీడీపీ గెలిచి మరీ సత్తా చాటింది. ఆ విధంగా వైఎస్సార్ తప్పులను ఎప్పటికపుడు ఎండగడుతూ సర్కార్ ని అలెర్ట్ చేస్తూ వచ్చింది. నాడు ఉమ్మడి ఏపీలో టీఆరెస్ కూడా వైఎస్సార్ కి చాలెంజ్ చేసే స్థితిలో ఉండేది. వామపక్షాలు కూడా నాడు బలంగా ఉండేవి. ఇక వైఎస్సార్ కూడా మొండిగా కాకుండా తప్పులు ఏమైనా ఉంటే సరిచేసుకునే నైజం కలిగిన వారుగా ఉండేవారు. ఆ కారణంగానే 2009 ఎన్నికల్లో టీడీపీ బాగా పుంజుకున్నా కూడా ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించి సరైన చర్యలతో మరో మారు గట్టెక్కారు వైఎస్సార్.జగన్ చూస్తే దూకుడు తప్ప మరో ఆలోచన ఉండదు అని అంటారు. దానికి తోడు పార్టీకి ప్రభుత్వానికి ఆయనే సారధి. రెండవ మనిషి కానీ నాయకత్వం కానీ ఎక్కడా లేకుండా చేసుకున్నారు. ప్రజా తీర్పులు అందించిన బలంతో మరిన్ని దూకుడు నిర్ణయాలకు జగన్ తెగిస్తారు అన్న మాట కూడా వైసీపీలో వినిపిస్తోంది. ఇక మీదట జగన్ తీసుకునే నిర్ణయాల విషయంలో జోరు తప్ప ఆపేవారు కూడా ఎవరు ఉండరని కూడా అంటున్నారు. ఇప్పటికే పార్టీలో దిగువ స్థాయి నుంచి పై దాకా ఒక మాదిరి అసంతృప్తి అయితే కమ్ముకుని ఉంది. పార్టీకి ఎక్కడైనా ఇబ్బంది వస్తే అపుడు జగన్ తమ వైపు చూస్తారని, తమ గోడు చెప్పుకోవాలని ఇంతకాలం సీనియర్లు సహా అంతా వేచి చూశారు. కానీ వారికి ఆ అవకాశం సమీప భవిష్యత్తులో లేదని తేలిపోతోంది.జగన్ విషయంలో మళ్ళీ ఎన్టీయార్ నే పోలిక తేవాలి అంటున్నారు. 1985లో భారీ విజయం తరువాత లోకల్ బాడీ ఎన్నికల్లోనూ టీడీపీ విజయఢంకా మోగించింది.

ఆ తరువాత ఎన్టీఆర్ లో ఒక్కసారిగా అతి ధీమా కనిపించింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది టైమ్ ఉన్న నేపథ్యంలో ఒక్కసారిగా మొత్తం మంత్రివర్గాన్ని ఎన్టీఆర్ తొలగించారు. ఆ తరువాత కొత్త వారిని ఏ మాత్రం అనుభవం లేని వారిని తెచ్చిపెట్టారు. వారితోనే 1989 ఎన్నికలను వెళ్తే దారుణమైన పరాభవం ఎదురైంది. ఇపుడు జగన్ కూడా మంత్రివర్గ ప్రక్షాళన పేరిట మొత్తానికి మొత్తం మంత్రులను తీసేస్తారు అన్న ప్రచారం అపుడే ఊపందుకుంది. అదే కనుక జరిగితే వివిధ జిల్లాల్లో బలమైన నాయకులుగా, సామాజికవర్గం పరంగా వైసీపీకి వెన్నుదన్నుగా ఉన్న బిగ్ షాట్స్ కి గట్టి షాక్ తగులుతుంది. అపుడు వారు రివర్స్ అయితే మాత్రం వైసీపీకి భారీ దెబ్బ పడడం ఖాయమని అంటున్నారు. మరి జగన్ వరస విజయాలను మత్తుగా కాకుండా ఒక హెచ్చరికగా భావించి నడచుకుంటే మాత్రం మరో మారు అధికారం ఆయనదే అన్న మాట కూడా ఉంది.

# పనస కాయలకు మంచి డిమాండ్

శ్రీకాకుళం, మే 5, (న్యూస్ పల్స్)ఉద్దానం పంటను ఉత్తరాది వాళ్లూ మెచ్చారు. ఇక్కడి పనసకు కాయలను ఆ రాష్ట్రాల వారు లొట్టలేసుకుని తింటున్నారు. దీంతో ఇక్కడి పనస డిమాండ్ పెరుగుతోంది. రుచి పరంగా అద్భుతంగా ఉండడంతో పాటు రంజాన్ సీజన్ కావడంతో ఉత్తరప్రదేశ్, బిహార్, తదితర రాష్ట్రాలు ఉద్దానం ప్రాంతం నుంచి పనస కాయలు, పండ్లను దిగమతి చేసుకుంటున్నాయి.మరోవైపు కాశీబుగ్గ కేంద్రంగా బరంపురం, గుజరాత్, కోల్కతా, కటక్ తదితర ప్రాంతాలకు కూడా పనస ఎగుమతి అవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ, పూండి, హరిపురం, కవిటి, ఇచ్ఛాపురం, మందస, కంచిలి, సోంపేట కేంద్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు పనస ఎగుమతులు ఊపందుకున్నాయి. గడచిన రెండు నెలల్లో రోజుకు సగటున 44 టన్నుల చొప్పున ఇప్పటివరకు 2,640 టన్నుల పనస కాయలు ఎగుమతి అయ్యాయి.మార్చి నెలాఖరు నుంచి మే వరకు పనస ఎగుమతులు కొనసాగుతాయి. తిత్లీ తుపానుకు దెబ్బతిన్న పనస చెట్లన్నీ ఈ ఏడాది జీవం పోసుకుని విరగకాస్తున్నాయి. ఉద్దాన ప్రాంతంలోని ఏడు మండలాల్లో పనస అంతర పంటగా సాగవుతోంది. ఇబ్బడిముబ్బడిగా దిగుబడులు రావడంతో ప్రస్తుతం కేజీ పనస కాయ కేవలం రూ.13 చొప్పున మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధర గతంలో కేజీ రూ.20 వరకు ఉండేది. ఉద్యాన శాఖాధికారులు పనస, మునగ తదితర పంటలకూ ప్రభుత్వ పరంగా



ధరలు నిర్ణయిస్తే మేలు జరుగుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.ముక్కల బిర్యానీ, పనస పొట్టు కూర, పనస పండు హల్వా, పనస పొట్టు వకోడి, పనస గింజల కూర, పనస ముక్కల గూనచారు, పనస చిల్లీ, పనస కాయ కుర్మా, పనసకాయ ఇడ్లీ, పొంగనాలు, పనస నిల్వ పచ్చడి, పనస బూరెలు.

# సీనియర్లు...మళ్లీ వెయిటింగ్

నెల్లూరు, మే 5, (న్యూస్ పల్స్)ధికార వైసీపీలో సీనియర్ల వ్యవహారం ముదురుతున్నట్టు కనిపిస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషి సల్పామని, జగన్ సీఎం అయ్యేందుకు అహరహం శ్రమించామని.. అయితే.. మంత్రి పదవులు, కీలకమైన నామినేటెడ్ పదవులు మాత్రం.. కొత్తవారికి ఇచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఏ పనికావాలన్నా.. జూనియర్లుగా ఉన్న మంత్రుల ముందుకు వెళ్లి చేతులు కట్టుకునే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. చాలా వరకు జిల్లాల్లో ఎంతో సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. దాదాపు నాలుగు నుంచి ఐదు సార్లుగా ఎమ్మెల్యే అయిన వారు సైతం ఉన్నారు.కొన్ని జిల్లాలో తొలిసారి ఎమ్మెల్యే అయిన నాయకుడికి.. మంత్రి పదవి ఇచ్చారు. ఈ క్రమంలో ఇప్పుడు సీనియర్ ఎమ్మెల్యేలు ఏ పనిచేయించుకోవాలని అనుకున్నా.. జూనియర్ అయిన.. మంత్రి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో సీనియర్లు.. తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక, మంత్రులుగా ఉన్న కొత్తవారు సైతం.. బెట్టు చేస్తున్నారు. మాకు సీఎం జగన్ అండ ఉంది. అనే ధీమా వీరిలో స్పష్టంగా కనిపిస్తోందని తెలుస్తోంది. దీంతో వైసీ?పీ లోని సీనియర్ ఎమ్మెల్యేలకు.. మంత్రులకు మధ్య సఖ్యత కుదరడం లేదు. ఈ పరిణామంతో ప్రతి జిల్లాలోనూ మంత్రులకు, ఎమ్మెల్యేలకు మధ్య విభేదాలు పొడసూపుతున్నాయి.చివరకు మునిసిపల్ చైర్మన్లు, కార్పోరేషన్లలో మేయర్ పదవులు కూడా ఎమ్మెల్యేలు, ఎంపీలు చెప్పిన వాళ్లకు ఇవ్వలేదు. దీనికితోడు.. సీనియర్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి జగన్ కనీసం అప్పాయింట్ మెంట్ ఇవ్వడం లేదు. కానీ, ఈ విషయాలను వేటినీ.. ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోవడం లేదు. దీంతో సీనియర్లు మరింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఇప్పటికిప్పుడు తమ ఆవేదనను బరస్ట్ చేయకుండా చూసుకుంటున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ వేవ్ జోరుగా ఉండడంతో.. ఎటూ వెళ్లే దారి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో మళ్లీ త్వరలోనే జరగనున్న మంత్రి వర్గ ప్రక్షాళనలో తమకు అవకాశం చిక్కకపోతుందా? అని కొందరు ఎదురు చూస్తుంటే.. ఎన్నికలకు ముందు రెండేళ్ల వరకైనా.. తమకు ప్రాధాన్యం ఏర్పడుతుందని ఆశ పడుతున్న వారు కూడా కనిపిస్తున్నారు. మరి జగన్ ఏం చేస్తారో చూడాలి.

## ముద్రగడకు రాజ్యసభ సీటు..?

కాకినాడ, మే 5, (న్యూస్ పల్స్)ముద్రగడ పద్మనాభంకు జగన్ అవకాశమివ్వనున్నారా? ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వాలని జగన్ ఆలోచిస్తున్నారా? అంటే అవుననే అనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికలను పవన్ కల్యాణ్ ను ధీటుగా ఎదుర్కొనాలంటే ముద్రగడ పద్మనాభంను దరి చేర్చుకోవడం మార్గమని జగన్ విశ్వసిస్తున్నారు. ముద్రగడ పద్మనాభాన్ని పార్టీలో చేర్చుకునేందుకు జగన్ సుముఖంగా ఉన్నారని, త్వరలోనే ఆయనను వైసీపీ కాపు నేతలు కలుస్తారని ప్రచారం జరుగుతుంది.ఎవరు అవునన్నా కాదన్నా ముద్రగడ పద్మనాభం కాపు సామాజికవర్గంలో బలమైన నేత. ఒక విధంగా చెప్పాలంటే పవన్ కల్యాణ్ కంటే ముద్రగడ పద్మనాభంను కాపు సామాజికవర్గం ప్రజలు ఎక్కువగా విశ్వసిస్తారు. కాపు సామాజికవర్గం కోసం ముద్రగడ పద్మనాభం గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేసిన



తీరును వారు గుర్తుంచుకుంటారు. వంగవీటి రంగా తర్వాత కాపు సామాజికవర్గం ఎక్కువగా ప్రేమించేది, గౌరవించేది ముద్రగడ పద్మనాభంను మాత్రమే.అయితే వైసీపీలో బలమైన కాపు నేతలు ఎవరూ లేరు. ఉన్నా వారి నియోజకవర్గాలకే ప్రభావం చేసే వారు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో బలమైన నేత లేరు. వంగవీటి రాధా టీడీపీలో ఉన్నారు. పవన్ కల్యాణ్, సోము వీర్రాజులు వచ్చే ఎన్నికల్లో కాపు సామాజికవర్గం ఓటర్లపైనే ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ముద్రగడ పద్మనాభంను పార్టీలోకి తీసుకురావాలని ఆ జిల్లాకు చెందిన నేతలకు జగన్ చెప్పినట్లు తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం పార్టీలో చేరితే ఆయనకు సముచిత గౌరవం ఇస్తామని, అంతేకాకుండా రాజ్యసభ పదవి కూడా ఇస్తామని జగన్ చెప్పినట్లు తెలిసింది. ముద్రగడ పద్మనాభంను తమ పార్టీలో చేరాల్సిందిగా ఇప్పటికే బీజేపీ ప్రయత్నించింది. సోము వీర్రాజు స్వయంగా వెళ్లి కలిసినా ఆయన సున్నితంగా తిరస్కరించారు. ముద్రగడ పద్మనాభంకు జగన్ అంటే కొంత సానుకూలత ఉందంటున్నారు. అందుకే జగన్ ప్రపోజల్ కు ఆయన అంగీకరించే అవకాశాలున్నాయి. జగన్ ఈ ఐడియా వర్క్ అవుట్ అయితే కాపు సామాజికవర్గంలో బీజేపీ, జనసేనకు కొంత గండిపడే అవకాశముంది.

## ఉత్సవ మూర్తుల్లా సర్పంచ్ లు

ఏలూరు, మే 5, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచుల పరిస్థితి దారుణంగా తయారైంది. నూతన సర్పంచ్లు కేవలం పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి కూర్చొని వచ్చేందుకు మాత్రమే పరిమితమయ్యారు. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అనంతరం కౌంటింగ్ జరగ్గా ఆ రోజునే రిటర్నింగ్ అధికారుల వద్ద గెలుపొందినట్లుగా ధ్రువీకరణ పత్రాలను అందుకున్న నూతన సర్పంచ్లు బాధ్యతల కోసం నెలన్నర ఎదురుచూశారు. అయితే ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ఎట్టకేలకు ఈ నెల 3న పంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి సర్పంచ్లకు బాధ్యతలు అప్పగించారు.పంచాయతీ సర్పంచ్లకు గ్రామంలో ఏ పనిచేయాలన్న సర్వాధికారాలు ఉంటాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో.. భిన్నమైన పరిస్థితి ఉంది. అట్టహాసంగా ఈ నెల 3న బాధ్యతలు స్వీకరించారే తప్ప ప్రభుత్వం నుంచి ఇంత వరకూ చెక్పవర్ రాలేదు. ఈ చెక్పవర్ లేకపోవడంతో నూతన సర్పంచ్లు ఆయా గ్రామ పంచాయతీల్లో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సమస్యతో పాటు, ఇతర ముఖ్యమైన పనులు చేపట్టేందుకు కూడా సర్పంచ్లకు అవకాశం లేకపోవడంతో వారు ఏమీ చేయలేకపోతున్నారు.ఇదిలా ఉంటే గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై కూడా సర్పంచ్లకు అజమాయిషీ లేకుండా చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సర్పంచ్ల అధికారాలకు మరింత కత్తెర పడినట్లయ్యింది. దీంతో వీళ్లంగా కూడా గుర్రుగా ఉన్నారు. ఇదిలా ఉంటే గెలిచినోళ్లంతా సర్పంచ్లుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రోజువారీ పంచాయతీ కార్యాలయాలకు వచ్చి సీట్లో కూర్చొని తిరిగి వెళ్లిపోవడమే జరుగుతోందని రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా కొత్తగా ఏ పనులు చేపట్టాలన్నా చెక్పవర్ అవసరం ఉందని, అయితే ఆ అధికారాన్ని ప్రభుత్వం ఇంతవరకూ ఇవ్వకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని సర్పంచ్ లు అంటున్నారు.

# విశాఖలో భారీగా మిరియాల పంటలు



విశాఖపట్టణం, మే 5, (న్యూస్ పల్స్)మిరియాల సాగుకు కేరళ పెట్టింది పేరు. ఇప్పుడు విశాఖ మన్యంలోనూ మిరియాలు సాగవుతున్నాయి. దిగుబడిలోనే కాకుండా నాణ్యతలోనూ మన్యం మిరియం కేరళకు గట్టి పోటీ ఇస్తోంది. కేరళలో పండే మిరియాల కంటే నాణ్యమైన ఆర్గానిక్ మిరియాలను విశాఖ మన్యం అందిస్తోంది. ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండానే.. ఇంకా చెప్పాలంటే పైసా పెట్టుబడి లేకుండానే గిరిజన రైతులు వీటిని పండిస్తున్నారు. ఈ ఏడాది ఒక్క మిరియాల పంట ద్వారానే మన్యం రైతులు రూ.150 కోట్ల వరకూ ఆదాయాన్ని ఆర్జించారంటే విశేషమే మరి. విశాఖ మన్యంలో కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాల సాగు జరుగుతోంది. కాఫీ తోటల ద్వారా కాపును బట్టి ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ ఆదాయం వస్తుంటే.. అందులో అంతర పంటగా వేస్తున్న మిరియాలతో రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకూ అదనపు ఆదాయం సమకూరుతోంది. మిరియాల సాగుకు సూర్యరశ్మితో పాటు తగిన నీడ కూడా ఉండాలి. నీరు నిలవని ఏటవాలు భూమి అవసరం. పాదులు 20 నుంచి 30 అడుగుల ఎత్తుకు పెరుగుతాయి కాబట్టి వాటికి ఆసరాగా ఎత్తయిన చెట్లు ఉండాలి. విశాఖ మన్యంలోని కొండవాలు ప్రాంతాలు సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం 98 వేల ఎకరాల కాఫీ తోటల్లో రైతులు అంతర పంటగా మిరియాల పాదులు వేశారు. ఒకసారి మొక్క వేస్తే రెండో ఏట నుంచే కాపు మొదలవుతుంది. 20 సంవత్సరాల పాటు జనవరి నుంచి ఏప్రిల్?మే నెల వరకూ ఫలసాయం వస్తుంది. ఈ ప్రాంతంలో కాఫీ మొక్కలకు నీడ కోసం పొడవుగా ఎదిగే సిల్వర్ ఓక్ చెట్లను పెంచుతున్నారు. ఆ చెట్ల మొదలులో మిరియం మొక్కలు నాటుతున్నారు. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా గిరిజన రైతులను మిరియాల సాగు వైపు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం కరియా ముండ, పన్నియూరు?1 అనే రకాల మిరియాలు సాగవుతున్నాయి. వాటికన్నా అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తిని ఇచ్చే మేలు రకాల మొక్కల (మదర్ ప్లాంట్ల)ను కోజికోడ్‌లోని భారత సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్?ఐఐఎస్ఆర్) నుంచి తీసుకొచ్చి చింతపల్లిలో నర్సరీల్లో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో శక్తి, మలబార్ ఎక్సెల్, పౌర్ణమి, గిరిముండ, పంచమి, శుభకర, శ్రీకర రకాల మొక్కలు ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో దాదాపు 4 వేల మెట్రిక్ టన్నుల మిరియాల దిగుబడి వచి?చంది. 3.2 కిలోల పచ్చి మిరియాలను ఎండబెడితే ఒక కిలో ఎండు మిరియాలు వస్తాయి. వాటి ధర కిలో రూ.360 నుంచి రూ.400 వరకూ ఉంది. ఈ లెక్కన గిరిజన రైతులకు దాదాపు రూ.150 కోట్ల వరకూ అదనపు ఆదాయం మిరియాలతో సమకూరింది.

# శ్రామిక వర్గ మహోపాధ్యాయుడు,కారల్ మార్క్స్ జయంతి

నెల్లూరు ప్రపంచ చరిత్ర గతిని మార్చిన కమ్యూనిస్టు మేధావి పాత్రికేయుడు కారల్ మార్క్స్ 203 వ జయంతి సందర్భంగా కావలి మండలం కొండాయగారి పాలెంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆద్వర్యంలో మార్క్స్ చిత్ర పటానికి పు?ల మాల వేసి ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అద్యక్షులు దమ్ము దర్గాబాబు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కారల్ మార్క్స్ జర్మనీలోని ట్రయర్ పట్టణంలో మద్య తరగతి కుటుంబంలో 1818 మే 5 న జన్మించారని చరిత్ర చెబుతోందన్నారు .కష్టాల కొలిమిలో జన చైతన్యంమే ధ్యేయంగా , దొపిడిని రద్దు చేయటం ద్వారా శ్రామిక వర్గం విముక్తి సాదిస్తుందని, సమాజంలో శ్రామిక వర్గం కష్ట జీవులు దొపిడిని యాజమానులు రాజ్యాంగ యంత్రం అస్తి ద్వారా కార్మిక వర్గన్ని అణచివేస్తుందని కార్మిక వర్గం సమస్యల నుండి బయటపడాలంటేసంఘిటితంగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అందుకొసం సిద్ధాంత ప్రాతిపాదికన పని చేసే రాజకీయ పార్టీ అవసరం అని అన్నారు. విప్లవం ద్వారా సమాజంలో మార్పులకు ప్రయత్నం సాగించాలని పేర్కొన్నారు. 1848 జనవరిలో లండన్ నగరంలో మార్క్స్ ఏంజిల్స్ కమ్యూనిస్టు ప్రణాళిక విడుదలైందన్నారు 1864 లండన్ నగరంలో అంతర్జాతీయ కార్మిక సంఘం ప్రపథమ ఇంటర్నేషనల్ స్థాపించబడింది తరువాత మార్క్స్ కుటుంబం దుర్భర జీవితం అనుభవించారు 1881 డిసెంబర్ లో మార్క్స్ భార్య జేన్నీ అనారోగ్యంతో మరణించిందన్నారు మరణానంతరం మార్క్స్ ఎంతో వేదకు గురై పెట్టుబడి గ్రంథం రచన చేశాడు మార్క్స్ క్యాపిటల్ గ్రంథం రచన కోసం సుమారు 25 ఏళ్ళు నిర్వీరామ కృషి చేశారు ఎన్నో దేశాలి రాజ్యంగాలు చదివాడు కష్టపడి కొత్త భాషలు నేర్చుకోని ము?లగ్రంథలు చదివాడు మార్క్స్ భావాలు సిద్దాంతాన్ని సహకారన్ని ఉపయెె?గించుకొని అనేక దేశాలు రాజకీయ పార్టీలు ఏర్పటయ్యాయి 1870లో కార్మిక వర్గం విప్లవ పార్టీ ఏర్పడింది ప్రపంచ విముక్తి సిద్ధాంతాన్ని అందించిన మేధావి ప్రపంచంలో అతి పెద్దదైన లండన లైబ్రరీ లో 18 వేలు గ్రంధాలను చదివిన మె?దట వ్యక్తి కమ్యూనిస్టు పితామహుడు కారల్ మార్క్స్ అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత సుబ్రహ్మణ్యం రామకృష్ణ శ్రీనువాసులు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు .

## హథీరాంజీ మఠం అధికారి మిశ్రా కు ఉద్వాసన

తిరుపతి హథీరాంజీ మఠం సేవల నుండి మిశ్రాకు ఉద్వాసన పలకాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఇటీవలే హతి రాంజీ మఠం లో పనిచేస్తున్న బసవరాజు అనే సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పై ఫిర్యాదు అందుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ ఈ మేరకు స్పందించింది. సెక్యూరిటీ గార్డ్ బసవరాజు ఆత్మహత్యకు పాల్పడిన అనంతరం తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మరణానికి ముందు బసవరాజు ఆత్మహత్య ప్రయత్నం చేసిన సందర్భంలో తన చావుకి కారణం తిరుపతి హతిరాంజీ మఠం మహంతు అర్జున్ దాస్, మఠం అధికారి మిశ్రా లే కారణమంటూ మరణవాంగ్మూలం ఇచ్చాడు. దీనిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. తాజాగా దేవాదాయశాఖ కమిషనర్ అర్జునరావు మఠం వ్యవహారాలపై సీరియస్ గా స్పందిస్తూ 60 ఏళ్ల పైబడిన వారి సేవలు మఠంలో అవసరం లేదంటూ.. 72 ఏళ్ల వయస్సు కలిగిన అధికారి మిశ్రాను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

## రెండు కిలోమీటర్లు నడిచిన నిండు గర్భిణీ

విశాఖపట్నం అరకు వేలి మండలం బస్కి పంచాయతీ గోందన పివిటిజి మహిళా గర్భిణి సుమారు 2 కిలో మీటర్లు దూరం నడిచింది. బస్కి మెయిన్ రోడ్ లో వచ్చి డెలివరి కోసం హాస్పిటల్ లో అతికష్టంమీద చెరింది. . ఈ గ్రామంలో 108 ఇతర వాహనాలు వెళ్ళడానికి అవకాశం లేదు, ఇటువంటి సమయంలో వైద్యం కోసం మాడగడ పి.హెచ్.సి లేదా అరకు వేలి సి. హెచ్.సి లో వైద్యం పొందాలంటే చాలా కష్టంగా ఉంటుంది .ప్రభుత్వం పథకాల పేరుతో ఆదివాసులకు తరతరాలుగా మోసం చేస్తుంగి.గిరిజన ప్రాంతంలో బస్కి పంచాయితీకి మౌలిక సదుపాయాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుంది. ఇప్పటికైనా పంచాయితీలో దుంగ్యపుట్ గోందన బిజ్జగుడ పిరిపాదోర్ కొంత్రాయిగుడ గ్రామాలకు సమగ్రంగా పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

## చందనోత్సవానికి సన్నాహాలు

సింహాచలం శ్రీశ్రీశ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి చందనోత్సవం ఈనెల 14వ తేదీన జరగబోతోంది. ఇందుకోసం చందనం చెక్కలు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి నిజరూప దర్శనమైన తర్వాత సహస్ర ఘట్టాభిషేకం అనంతరం చందన సమర్పణ నిమిత్తం స్వామివారం భండారం నుంచి చందనం కర్రలు తీసుకుని ... చందనం తీయడానికి అనుకూలంగా వాటిని చిన్న చిన్న ముక్కలుగా తయారుచేయడమైనది. అరగదీతకు అనుకూలంగా శుభ్రపరిచారు. చందనం సాన ముహూర్తి 7వ తేదీ... అప్పటి నుంచి చందనం తీయడం ఆరంభమవుతుంది. ఈ ప్రక్రియ ఐదారు రోజులపాటు జరగనుంది. సుమారు 120 కేజీల చందనంలో సుగంధద్రవ్యాలను మిళితం చేసి స్వామివారికి సమర్పించనున్నారు.

## ఆక్సిజన్ కు పెరిగిన డిమాండ్

తిరుపతి కరోనా సెకండ్ వేవ్ .. ఆక్సిజన్ పై అందరిలోనూ ఆందోళన రేపుతోంది. కాస్తా ప్రాణవాయువు తగ్గిందంటే చాలు ప్రాణాలు పోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. కరోనా కేసులు భారీగా పెరుగుతుండటంతో.. కొన్ని చోట్ల ఆక్సిజన్ అందక కరోనా పెషేంట్లు కోల్పోతున్న పరిస్థితి.దీంతో ఆక్సిజన్ కు భారీగా డిమాండ్ పెరిగింది. తిరుపతిలో కేసులు పెరుగుతున్న దశలో ఆక్సిజన్ పై ప్రతిఒక్కరూ గళమెత్తుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ తగినంత నిల్వలను అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. అక్సిజన్ అత్యవ సరంగా మారిన సమయంలో విపత్కర పరిస్థితులు చోటు చేసుకోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేశంలో కరోనా కేసుల పెరుగుతున్న వేళ.. మెడికల్ ఆక్సిజన్కు విపరీత మైన డిమాండ్ పెరిగింది. దీంతో ఆస్పత్రలుకు సరైన మొత్తంలో ఆక్సి జన్ అందించాల్సిందిగా పలు రాష్ట్రా లు ఇప్పటికే కేంద్రాన్ని కోరుతున్నాయి.

# హెల్త్ కిట్ల పంపిణీ

చిత్తూరు కరోనా ప్రజలపై విరుచుకుపడుతున్న వేళ స్వచ్ఛంధ సంస్థలు దాతృత్వంతో ప్రజలను ఆదుకునేందుకు ముందుకు వస్తున్నాయి. ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తు వారికి పౌష్టికారాహాన్ని అందించేలా కృషి చేస్తున్నాయి.చిత్తూరు జిల్లాలో స్పూర్తి అనే స్వచ్ఛంధ సంస్థ సేవా కార్యక్రమాల్లో బాగంగా వైద్యుల సూచనలు సలహాల మేరకూ హెల్త్ కిట్ లను పంపిణీ చేశారు.వీటితో పాటుగా మందులను కూడా ప్రజలకు పంపిణీ చేశారు.కరోనా ప్రభావంతో ప్రజల్లో రోగనిరోధక శక్తి హరించిపోతున్న తరుణంలో ప్రజలకు ఆరోగ్యం అందించే మందులు,డ్రైఫ్రూట్స్ ను ఆ సంస్థ ప్రతినిధులు అందించారు.

## ఏపీకి మరో 5 లక్షల కోవిషీల్డ్ డోసులు

అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో 5 లక్షల కోవిషీల్డ్ వ్యాక్సిన్ డోసులు మంగళవారం చేరుకున్నాయి. పుణెలోని సీరం ఇన్స్టిట్యూట్కు చెందిన కోవిషీల్డ్ వ్యాక్సిన్ డోసులను ఢిల్లీ నుంచి విమానంలో గన్నవరం విమానాశ్రయానికి తీసుకువచ్చారు..ఐదు లక్షల కోవిషీల్డ్ వ్యాక్సిన్ డోసులు జిల్లాల వారీగా పంపిణీ చేస్తున్నారు.అనంతపురం-45వేలు, చిత్తూరు-40 వేలు, తూ.గో-40 వేలు, గుంటూరు-40 వేలు, కృష్ణా-45 వేలు, కర్నూలు-40 వేలు, ప్రకాశం-35 వేలు, నెల్లూరు-38 వేలు, శ్రీకాకుళం-30 వేలు, విశాఖ-40 వేలు, విజయనగరం-30 వేలు, ప.గో-37 వేలు, కడప-40 వేలు.

## అందరాష్ట్ర దొంగలు ఆరెస్టు

చిత్తూరు చిత్తూరు జిల్లా పలమనేరు డిఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో గంగవరం పోలీసులు ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా వున్నాయి. గంగవరం మండలం, గండ్రాజుపల్లె అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంగా బెంగుళూరు నుండి చిత్తూరు వైపు వెళ్తున్న ఓ కారులోని రెండు బ్యాగుల్లో నోట్ల కట్టలు ఉండటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు పశ్చిమ బెంగాల్ కు చెందిన సుబంకర్ షిల్ మరియు రాజు దేవనాథ్ గా తెలిసిందన్నారు. వారిని లోతుగా విచారించగా వారు తమ స్నేహితుడు సంజు సాహుతో కలిసి ఈ నెల 2వ తేదీనఅల్మారాలోని 90 లక్షల నగదు దొంగిలించి,బెంగళూరు నుండి కారు బాడుగకు మాట్లాడుకొని వస్తుండగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో గంగవరం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా వీరి కారులో మూటలు ఉండగా వాటిని విప్పి చూడగా అందులో నోట్లకట్టలు గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు.

# చేతులెత్తేసిన ప్రభుత్వం

**యరపతినేని**

గుంటూరు కరోనా మహమ్మారితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలమయిపోయి వేలాది మంది ప్రాణాలు కోల్పోతావుంటే, రోమ్ నగరం తగులబడుతుంటే ఫిడేల్ వాయిస్తున్న రోమ్ చక్రవర్తి లాగా ఉంది జగన్ ప్రభుత్వ పరిపాలన వుందని గురజాల నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైయస్సార్ పార్టీ, నేడు ప్రజలను రక్షించి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసి చోద్యం చూస్తావుందని అయన అన్నారు. ఈరోజు కరోనా "సెకండ్ వేవ్" తో రాష్ట్రంలో అల్లకల్లోలమైన పరిస్థితులు మనకు కనిపిస్తావున్నాయి. కరోనా "ఫస్ట్ వేవ్" ని సమర్ధవంతంగా ఎదుర్కోవడంలో విఫలమైన ప్రభుత్వం, సెకండ్ వేవ్ నష్టాన్ని అంచనా వేయడంలో కూడా ఘోరంగా విఫలమయ్యింది. ఫస్ట్ వేవ్ కి, సెకండ్ వేవ్ కి సంవత్సరం పైగా టైం వున్నా, సెకండ్ వేవ్ వస్తే ఉత్పన్నమయ్యే పరిస్థితుల్ని ధీటుగా ఎదుర్కోవడానికి కావల్సిన పరిస్థితుల్ని కల్పించలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆక్సిజన్ లేక ప్రజలు చనిపోతావుంటే, ఆక్సిజన్ సప్లై ఎంత కావాలి? రాష్ట్రంలో ఉన్న హాస్పిటల్స్ ఎన్ని? దానికి కావలసిన ఆక్సిజన్ సమకూర్చడంలో కూడా జగన్మోహన్ రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమయ్యింది. రోజుకి 20 వేల మందికి పైగా కరోనా రోగులు, కరోనా బయటపడటంతో ఆసుపత్రుల్లో బెడ్లు లేక, సౌకర్యాలు లేక, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి డబ్బులు చెల్లించలేక, ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అయన అన్నారు.ఈరోజు 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయస్సు గల వారికి కూడా టీకాలు వెయ్యమని, ఒకపక్క ప్రజల నుండి డిమాండ్ వున్నా, టీకాలు కొని ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ప్రజలందరికీ కూడా టీకాలు వేసి కోవిడ్ బారినపడకుండా చూడటంలో కూడా ఈ ప్రభుత్వం విఫలమయ్యింది. రెండు లక్షల కోట్ల రూపాయల అప్పు ఈ రెండు సంవత్సరాల్లో చేసి, ఆ డబ్బును ఏం చేశారో? కూడా తెలియని ఈ ప్రభుత్వం, కేవలం రూ. 1,600 కోట్ల రూపాయలు పెట్టి టీకాలను కొని ప్రజల ప్రాణాలను రక్షించలేని పరిస్థితిలో ఉందంటే, ఈ ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత ఒక్క నిమిషం కూడా లేదని అయన అన్నారు. వేలాది మంది ప్రాణాలు పోతుంటే, దానికి కారణమైన జగన్మోహన్ రెడ్డి సర్కార్ని ఈరోజు బోనులో నిలబెట్టాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రాణాలను కాపాడలేని మీరు, ఇంకా ప్రజలకు ఏమి చేస్తారు. ఆంధ్రప్రదేశ్ లో కేవలం అధికారాన్ని అడ్డంపెట్టుకుని స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవం చేసుకోవడం, దొంగ ఓట్లు వేసుకొని తిరుపతి ఎన్నికల్లో గెలవడం, తెలుగుదేశం పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం, ఆస్తులు ఆక్రమించుకోవడం, ఆస్తులు ధ్వంసం చేయడం, పరిశ్రమలు మూసివేయడం, ఇవి తప్పితే మీరు సాధించింది ఆంధ్రప్రదేశ్ సంక్షేమం పట్ల, ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ప్రజల సంక్షేమం పట్ల, ఆరోగ్యం పట్ల, ప్రాణాల పట్ల మీకు చిత్తశుద్ధి లేదనే ఈ రోజు ప్రతి ఒక్క ఆంధ్రుడు కూడా మనోవేదన చెందుతున్న విషయం యదార్థమని లయన అన్నారు.

# దేశ వ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

**కరోనా కట్టడిలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం**

**- కరోనా మృతుల కుటుంబాలను ఆదుకోవాలి**

**- ప్రతీ వ్యక్తికీ విధిగా వైద్య సేవలు అందించాలి**

రాజమహేంద్రవరం... ...భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో భాగంగా ప్రతీ పౌరుడికి ఉచిత విద్య, వైద్య సేవలను అంచాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా సెకెండ్ వేవ్ కట్టడి చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే దేశ వ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీని విధించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన 24 గంటలలో దేశ వ్యాప్తంగా 3,57,227 మంది కరోనా బారిన పడ్డారని, ఒక్క రోజులోనే 3,449 మంది మరణించడం జరిగిందని ఇటువంటి విపత్కర సమయంలో కరోనా కట్టడి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కోవిడ్ రెండవ దశలో మెడికల్ మాఫియాకు ప్రభుత్వాల అండదండలతో మూడుపువ్వులు ఆరు కాయలు చందంగా వ్యాపారం సాగిస్తున్నాయని ఆరోపించారు. ఆక్సిజన్, వైద్య పరికరాలు, ఔషధాలు, రేపిడ్ కిట్లు సమకూర్చటం పై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించ కుండా ప్రచార ఆర్భాటాల కోసం వెంపర్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలు కాపాడవలసిన పాలకులు, సినిమాహాళ్ళ, పబ్బులు, బార్లు, మద్యం దుకాణాలు, కుంభమేళాలు ఎన్నికల ప్రచారాల ద్వారా జన భాహుళ్యంలో బలప్రదర్శన కోసం తరలించి కోవిడ్ విస్తరణకు పాలకులు పాల్పడి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా కరోనా బాధితులు 2,02,82,833 మంది ఉన్నారని ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయినవారు 2,22,408 మంది మరణించడం బాధాకరమని అన్నారు. ఆక్సిజన్ అందక మరణించిన వారందరినీ ప్రభుత్వ హత్యలుగా భావించి సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఒక ప్రక్క కరోనా మహమ్మారి విలయ తాండవం చేస్తుంటే... కరోనా సోకి ఆక్సిజన్ అందక ఆసుపత్రికి వెళుతుంటే బెడ్స్ కొరత, ఆక్సిజన్ కొరత బ్లాక్ మార్కెట్లో రెమిడీస్ వర్ మరియు ఫేబీ ఫ్లూ 400 ఎం.జి. వంటి మందులు కార్పోరేట్ ఆసుపత్రులు దందాలు చేస్తూ సామాన్య ప్రజల జేబులు కాళీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు శోధ్యం చూస్తున్నాయని విమర్శించారు. విశాఖ, రాజమండ్రి, కాకినాడ, భీమవరం, విజయవాడ, గుంటూరు పట్టణాలలో కోవిడ్ చికిత్స చేస్తున్నట్లు ప్రభుత్వాలు జీ.ఓ లు జారీ అవుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎటువంటి సేవలు అందకపోవడం బాధాకరమన్నారు. కోవిడ్ ను ఆరోగ్యశ్రీలో చేర్చాలని హైకోర్టు ఉత్తర్వులు మేరకు ఆలస్యం గానైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీ.ఓ ఆర్.టి. నెం : 30 జారీ చేయడం అభినందనీయమని పితాని సత్యనారాయణ అన్నారు. అయినప్పటికీ ఆ జీ.ఓలు ఏమి అమలు కావడం లేదని తక్షణమే ఆ జీ.ఓ లను అమలుచేసి రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఒకే దేశం, ఒకే పార్టీ నినాదంతో ఉన్న కేంద్రప్రభుత్వం ఔషదాల ధరల నియంత్రణలో రాష్ట్రానికీ, కేంద్రానికీ మధ్య వ్యత్యాసం ఎందుకు వస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఔషధాల రేట్లను పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. బ్లాక్ మార్కెట్లో కాసులు దండుకుంటున్న ఔషదాలకన్నా అతి తక్కువ ధరకే లభించే స్టెరాయిడ్స్ (డెకడ్రాన్) ఉపయుక్తంగా ఉంటాయని వైద్యులుసిఫార్సులు చేస్తున్నందున వాటిని వినియోగించుకుని ప్రజలపై పెనుభారాన్ని తగ్గించాలని అన్నారు. స్కానింగ్ లు మాటున స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు రోగుల దగ్గర అధిక ధరలు వసూలు చేయడంపై చర్యలు చేపట్టాలని అన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి

**కరోనా నేపథ్యంలో ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్**

రాజమహేంద్రవరం కోవిడ్ - 19 పాజిటివ్ చికిత్స విషయంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి ఆస్కారరావు డిమాండ్ చేసారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ఒకే రాయితీ ఉండాలన్నారు. కోవిడ్ బారిన పడ్డ అన్ని శాఖల ఉద్యోగులకు 14రోజుల జీతంతో కూడిన ప్రత్యేక సెలవు మంజూరు చేయాలన్నారు. రోజువారీ 50శాతం రొటేషన్ పద్ధతిపై ఉద్యోగులను అనుమతించాలని డిమాండ్ చేసారు. కోవిడ్ వ్యాధితో మరణించిన ఉద్యోగులకు గతంలో కేంద్రం ప్రకటించిన విధంగా 50లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలని, కోవిడ్ బారిన పడి చనిపోతున్న కాంటాక్ట్ , అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస భద్రత కరువైందని పేర్కొన్నారు. వారి కుటుంబాలను ఆదుకునేవిధంగా కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని ఆస్కారరావు కోరారు. గ్రామ, వార్డు సచివాలయాలతో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రేషన్ సరుకుల సరఫరాలో తక్షణమే బయోమెట్రిక్ విధానం రద్దుచేయాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రాజు, సిహెచ్ పాపారావు, జిల్లా అధ్యక్షుడు ఎంవివి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు శివ సమావేశంలో పాల్గొన్నారు.

## వర్రా అంగన్వాడీ కేంద్రంలో కుళ్ళిన కోడిగుడ్లు

అరకులోయ మండలంలోని వర్రా గ్రామంలో కుళ్ళిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు ప్రభుత్వం చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలన ప్రభుత్వ లక్ష్యం నిరుగారుస్తున్నారు చిన్న పిల్లలు రక్తహీనత తో మరణాలు సంభవిస్తుందిని అంగన్వాడీ కేంద్రలలో పౌష్టికాహారం అందించినప్పటికి పక్కదారి పడుతుంది

# బెంగాల్ లో బీజేపీ కార్యకర్తల పై దాడులు అమానుషం

**బిజెపి మహిళా నాయకురాలు బిందు రెడ్డి**

నెల్లూరు పశ్చిమబెంగాల్ లో బిజెపి కార్యకర్తలపై తృణముల్ కాంగ్రెస్ పార్టీ గుండాల క్రూరమైన చర్యలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బిజెపి తిరుపతి జిల్లా పార్లమెంట్ అధ్యక్షురాలు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బిందు రెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి నాయకత్వం లో లో లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ధర్నాలో భాగంగా ఆమె స్వగృహంలో బుధవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెంగాల్ లో బీజేపీ కార్యకర్తల పై మరియు వారి ఆస్తులపై దాడులు చేయడంతో పాటు అడ్డుకున్న వారిని హత్యలు చేసి, అదే సమయంలో ఏక మంది బెంగాలీ ఆడపడుచులపై అత్యాచారాలకు పాల్పడిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన గుండాల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఇటువంటి అనాగరిక, అనైతిక చర్యలకు పాల్పడే వారిని గుర్తించి తగిన శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిజెపి జాతీయ నాయకుల నాయకత్వంతో, పిలుపు మేరకు ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలియజేశారు.

## బెంగాల్లో హింస, మారణకాండ అమానుషం

**- ఖని లో బిజెపి నాయకుల నిరసన**

గోదావరి ఖని మే 5 బెంగాల్లో ఎన్నికల అనంతరం జరుగుతున్న హింస, మారణకాండ దోపిడిలను బిజెపి తీవ్రంగా ఖండించారు. బుధవారం గోదావరిఖని లో నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు సిద్ధాంతపరంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొన్నాం కానీ, ఎన్నడూ భారతీయ జనతా పార్టీ హింసకు పాల్పడలేదన్నారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ గుండాలు బీజేపీ కార్యకర్తలపై ఈ మారణహోమం ఆపాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. ఉన్నఫలంగా శాంతిభద్రతలులోకి తీసుకురావాలని బిజెపి డిమాండ్ చేస్తూ హెచ్చరిస్తోందని,

గత ఎన్నికల్లో మూడు సీట్ల నుండి 78 సీట్లకు ఎదిగిన భారతీయ జనతా పార్టీ ఎదుగుదలను ఓర్వలేక మమతా బెనర్జీ పదవి అధికార వ్యామోహంతో ఇలాంటి సంఘటనలకు పాల్పడినప్పుడు అక్కడి డిజిపి లా అండ్ ఆర్డర్ ను చేయకపోవడం ఇది పూర్తి హిందూ వ్యతిరేకులుగా నేను అభినందిస్తున్నాను ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిసిపికి మర్యాదపూర్వకంగా తెలియజేస్తున్నామన్నరు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ, కేంద్ర హోం శాఖ మాత్యులుకి ఆర్టికల్ 365 ఇంప్లిమెంట్ చేసి పశ్చిమబెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కాజీపేట శివాజీ జక్కుల నరహరి, రాజేష్, రాచకొండ కోటేశ్వర్లు, సుల్వ లక్ష్మీనరసయ్య, అన్న గోపగాని నవీన్, మాధవి, రాకేష్, కలువల సంజీవ్, బోనగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షలను అతిక్రమిస్తే కఠిన చర్యలు...

## రూరల్ సిఐ డి.వి నారాయణరెడ్డి

తుగ్గలి ( విభారె) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల పాటు ఏర్పాటుచేసిన కోవిడ్ ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని,కోవిడ్ ఆంక్షలను అధిగమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ రూరల్ సిఐ డి.వి నారాయణ రెడ్డి తెలియజేశారు.ఈ సందర్భంగా బుధవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్టేషన్ పరిధిలోని గల రోల్లపాడు తాండ, శభాష్ పురం మరియు కడమకుంట్ల గ్రామాలలో కొనసాగుతున్న కర్ఫ్యూ ను జొన్నగిరి ఎస్.ఐ సురేష్,పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీ.ఐ గ్రామాలలో పర్యటించి ప్రభుత్వం నిర్దేశించిన రెండు వారాల కర్ఫ్యూను ప్రతి గ్రామంలో అమలయ్యేలా ప్రజలు సహకరించాలని వారు తెలియజేశారు.ప్రజలు అత్యవసర పరిస్థితులలోనే బయటకు రావాలని,బయటకు వచ్చేటప్పుడు తప్పకుండా మార్చుకున్న ధరించాలని ఆయన గ్రామ ప్రజలకు తెలియజేశారు.రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం 12 గంటల తర్వాత 144 సెక్షన్ అమలులో ఉంటుందని,కావున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా ఇళ్లలోనే ఉండి జాగ్రత్త పడాలని ఆయన తెలియజేశారు. గ్రామాలలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఏర్పడితే సంబంధిత గ్రామ సచివాలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించాలని సి.ఐ ప్రజలకు తెలియజేశారు.కరోనా నిబంధనలను అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు సి.ఐ హెచ్చరించారు.రోల్లపాడు తాండ గ్రామంలో పలు కిరాణం షాపులను మూసివేయించి,గ్రామంలో గుంపులు గుంపులుగా ఉన్న ప్రజలను చెదరగొట్టారు.

అనంతరం గ్రామ సమీపంలో అడవిలో బయల్పడిన ఆంజనేయ స్వామి విగ్రహా ప్రదేశాన్ని పరిశీలించి,దర్శనం కొరకు వచ్చే భక్తులు కోవిడ్ నిబంధనలను తప్పకుండా పాటించాలని నిర్వాహకులకు సి.ఐ తెలియజేశారు.అదేవిధంగా కడమకుంట్ల, శభాష్ పురం గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ ను సీఐ పరిశీలించారు.వాహనాలపై వెళ్లేవారు 12 గంటల లోపల ఇంటికి చేరుకోవాలని గ్రామస్తులకు తెలియజేశారు.ప్రతి ఒక్కరూ కరోనా నివారణ చర్యలు పాటిస్తూ జాగ్రత్త పడాలని సి.ఐ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జొన్నగిరి ఎస్ఐ సురేష్,తుగ్గలి మరియు జొన్నగిరి పోలీస్ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాస్క్ నుంచి మొక్కగా



కొవిడ్ నుంచి మనల్ని కాపాడే ఆయుధాల్లో 'మాస్క్' ఒకటి. కరోనా బారిన పడకుండా ఉండేందుకు గతేడాది నుంచి మాస్కులు వినియోగిస్తుండగా, వాటి ఉపయోగం తర్వాత పలువురు ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే సముద్రాల్లో మాస్క్‌ల వల్ల విపరీతమైన చెత్త పేరుకుపోతుండగా, సముద్ర జీవులకు వాటివల్ల అపారనష్టం జరుగుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. పట్టణాల్లోనూ ఈ సమస్య విపరీతంగానే ఉంది. దాంతో మంగళూరుకు చెందిన నితిన్ వాస్ తన 'పేపర్ సీడ్ కో' సంస్థ ద్వారా ఓ మాస్క్ రూపొందించి పర్యావరణహిత పరిష్కారం చూపించాడు.పర్యావరణ ప్రేమికుడైన నితిన్ రూపొందించిన మాస్క్ వైరస్ నుంచి కాపాడటమే కాకుండా, దాన్ని నేల మీద పారేస్తే అది ఓ మొక్కగా వృద్ధి చెందడం విశేషం. కాటన్ మాస్క్‌లు వాస్తవానికి రీసైకిల్ రాగ్స్(క్లాత్ పీసెస్)తో తయారవుతాయి. వస్త్ర పరిశ్రమ నుంచి సేకరించిన కాటన్ ఫ్లష్, వివిధ స్క్రాప్ పదార్థాలను ఉపయోగించి మాస్క్ ఔటర్ కవర్ తయారు చేశారు. లోపలి లైనింగ్‌ను మృదువైన పత్తి వస్త్రంతో తయారు చేస్తారు. అవి తగినంత మందంగా ఉండటంతో, ఇన్‌ఫెక్షన్స్ రాకుండా మనల్ని కాపాడుతాయి.పర్యావరణ హితం కోసం ఈ ఆవిష్కరణ..2017 నుంచి వివిధ రీసైకిల్, ప్లాంట్ సీడ్ ఆధారిత వస్తువులను తయారు చేస్తున్న ఈ సంస్థ, కొవిడ్ టైమ్‌లో ముసుగులతో ప్రయోగాలు చేయడం ప్రారంభించింది. కరోనా బారిన పడకుండా కాపాడే మాస్క్‌లు వాడి పారేసిన తర్వాత ఇతర జాతులకు సమస్యలు సృష్టిస్తున్నాయి. రోడ్లపై, చెత్తలో పడేసిన మాస్క్‌లు వీధి కుక్కలు, ఆవులు, ఇతర జంతువులు తినడం లేదా వాటిని తాకడం జరుగుతుంది. దీనివల్ల అవి అనారోగ్యానికి గురి కావడంతో పాటు కోలుకోలేని నష్టం కలిగిస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎకో సంస్థ వినూత్నంగా మాస్క్‌లను ఆవిష్కరించింది. పత్తితో తయారైన మాస్కులను ఒకసారి ఉపయోగించిన తర్వాత మట్టిలో పూడ్చి, కొద్దిగా నీరు పోస్తే చాలు. కొద్ది రోజుల్లోనే అది మొక్కగా పెరుగుతుంది. వీటిని తయారు చేసేందుకు వారికి రూ.25 ఖర్చవుతుంది. వీటిని తయారు చేసేందుకు మెషిన్స్ ఉపయోగించడం లేదు. స్థానిక ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నారు. అందుకే కాస్త ధర ఎక్కువగానే ఉంటాయి. చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఈ మాస్క్‌ల తయారీకి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడంతో పాటు పర్యావరణహితం కోసం కష్టపడుతున్నారు.

# ఆర్టీసీ కీలక నిర్ణయం

విజయవాడ, మే 5,( విభారె) ఏపీలో కర్ఫ్యూ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి మధ్యాహ్నం 12 తర్వాత కఠినమైన ఆంక్షలు అమలుకానున్నాయి. ఆర్టీసీ బస్సులకు సంబంధించి కూడా ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ప్రజా రవాణా వాహనాలు నడపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో బస్సులు, ఆటోలు, క్యాబ్‌లు వంటివి మధ్యాహ్నం తర్వాత నడిపేందుకు అవకాశం ఉండదు. బస్సులు తిరిగేందుకు ఆరుగంటలే సమయం. ఆయా జిల్లాల పరిధిలోని, పక్క జిల్లాలకు వెళ్లే సర్వీసులనే ఆర్టీసీ నడపనుంది.మరోవైపు ఇతర రాష్ట్రాలకు తిరిగే సర్వీసులు అన్నింటినీ నిలిపేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటికే బెంగళూరు, చెన్నైకు బస్సులు నిలిపివేయగా.. తాజాగా హైదరాబాద్‌కు సర్వీసులు ఆపేశారు. దూర ప్రాంత సర్వీసులు దాదాపు నిలిపేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటికే 50% సీట్ల సామర్థ్యంతో నడుపుతుండగా.. బుధవారం నుంచి కనీసం 85 శాతం సీట్లలో ప్రయాణికులు నిండితేనే బస్సులు బయలుదేరనున్నాయి. ఓ ప్రాంతానికి వెళ్లే రెండు, మూడు సర్వీసులను కలిపి ఒకే సర్వీసుగా పంపనున్నారు. బస్టాండ్లకు వచ్చే ప్రయాణికుల రద్దీని బట్టి సర్వీసులు నడుపుతామని అధికారులు తెలిపారు. రాష్ట్ర సచివాలయ, హైకోర్టు ఉద్యోగుల కోసం నడిపే సర్వీసులు అన్నింటినీ మాత్రం కొనసాగిస్తారు.ఆర్టీసీ మాత్రమే కాదు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సైతం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు నడిచే సర్వీసులకే అనుమతి. ప్రభుత్వ ఆదేశాలు పాటించాలంటూ ప్రైవేట్ బస్ ఆపరేటర్ల సంఘం నేతలు.. అందులోని సభ్యులందరికీ అధికారులు తెలియజేశారు. ఇప్పటికే ప్రయాణికులు లేక 5-80 % సర్వీసులు ఆపేశామని, కర్ఫ్యూతో మిగిలిన సర్వీసులు దాదాపు నిలిచిపోయే అవకాశం ఉందని బస్సుల యజమానులు అంటున్నారు.మరోవైపు ఏపీ సరిహద్దు వద్ద పబ్లిక్ వాహనాలపై ఆంక్షలు విధించారు. అత్యవసర వాహనాలు, గూడ్స్, ట్రాన్స్‌పోర్ట్ వాహనాల మినహాయించి ఇతర ఏ వాహనాలకు అనుమతి లేదని కృష్ణాజిల్లా పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి.. ఉదయం ఆరు గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. రెండు వారాలపాటు ఏపీ బార్డర్లో ఈ ఆంక్షలే అమలులో ఉంటాయని.. వాహనదారులు గమనించాలని కోరారు. అలాగే నిత్యావసరాలు, ఇతర సరుకులు రవాణా చేసే వాహనాలకు మాత్రం అనుమతి ఉంది.. వారికి కర్ఫ్యూ ఆంక్షలు వర్తించవని అధికారులు తెలిపారు. అయితే లోడింగ్, అన్ లోడింగ్ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపే చేయాల్సి ఉంటుంది. వైద్య ఆరోగ్యానికి సంబంధించిన మందులు, ఇతర వస్తువులు ఎప్పుడైనా చేసుకోవచ్చు

# నరేంద్రకు బిగ్ రిలీఫ్

విజయవాడ, మే 5, ( విభారె) మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకు ఊరట లభించింది. సంగం డెయిరీ కేసులో అరెస్టైన కేసులో ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ధూళిపాళ్లకు మెరుగైన వైద్యం అందించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న హైకోర్టు నరేంద్రకు సీటీ స్కాన్ , ఇతర పరీక్షలు చేయించాలని ఆదేశించింది. కరోనా నిర్ధారణ అయితే వెంటనే ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాలని స్పష్టం చేసింది. సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్‌ను విజయవాడ ఆయుష్‌లో చేర్పించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.సంగం డెయిరీ కేసులో ధూళిపాళ్ల నరేంద్రను ఏసీబీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# ఐపీఎల్ వాయిదా.. ఆ 10 నిమిషాల్లో ఏం జరిగింది?




న్యూఢిల్లీ: పదే పది నిమిషాలు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ను వాయిదా వేయాలన్న నిర్ణయం తీసుకోవడానికి పట్టిన సమయం ఇంతే. బీసీసీఐ కార్యదర్శి జే షా.. ఐపీఎల్ జనరల్ కౌన్సిల్‌కు కాల్ చేయడం.. ఇప్పుడున్న పరిస్థితుల్లో టోర్నీ కొనసాగించడం కుదరదని చెప్పడం నిమిషాల్లోనే జరిగిపోయింది. మంగళవారం అనూహ్య పరిస్థితుల్లో ఐపీఎల్ వాయిదా వేయడం వెనుక ఆ పది నిమిషాలు ఏం జరిగిందన్న దాని గురించి వస్తున్న వార్తలు ఆసక్తి రేపుతున్నాయి.బయో బబుల్‌లోకే వైరస్ చొరబడిన తర్వాత ఇక లీగ్‌ను కొనసాగించడం అసాధ్యమని ఐపీఎల్ జనరల్ కౌన్సిల్‌తో జే షా స్పష్టం చేశారు. ఆటగాళ్ల భద్రతే ముఖ్యమని, అందులో రాజీ లేదని ఆయన తేల్చి చెప్పారు. అయితే కౌన్సిల్‌లో ఓ సభ్యుడు మాత్రం లీగ్ కొనసాగాలని పట్టుబట్టినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. అయితే ఇతరులు దానికి ఆమోదం తెలపకపోవడంతో ఆ సభ్యుడు ఏమీ చేయలేకపోయారు. ముంబైతో మ్యాచ్‌కు ముందే సన్‌రైజర్స్ ప్లేయర్ వృద్ధిమాన్ సాహా కరోనా బారిన పడినట్లు తేలడంతో అత్యవసరంగా ఈ సమావేశం ఏర్పాటు చేసిన బీసీసీఐ లీగ్‌ను వాయిదా వేసింది.అప్పటికప్పుడు ఒక నగరంలోనే అన్ని టీమ్స్‌కు బయో బబుల్ ఏర్పాటు చేసి మ్యాచ్‌లు నిర్వహించడం అసాధ్యమని బీసీసీఐ భావించింది. బయో బబుల్‌లోకే వైరస్ చొరబడటంతో ఇక మా ముందు మరో మార్గం లేకపోయింది. రానున్న రోజుల్లో ఎంత మంది ప్లేయర్స్, కోచ్‌లు దీని బారిన పడతారో అన్న ఆందోళన కలిగింది. దీంతో టోర్నీని వాయిదా వేశాం అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కూడా లీగ్‌ను వాయిదా వేయడం తప్ప తమ ముందు మరో మార్గం లేకపోయిందని చెప్పారు. అందరం మాట్లాడుకొని లీగ్‌ను వాయిదా వేయాలని నిర్ణయించామని అన్నారు.ప్రస్తుతానికి దీనికి స్పష్టమైన సమాధానమైతే లేదు. ఈ నెలలో మాత్రం సాధ్యం కాదని లీగ్‌ను వాయిదా వేసే సమయంలోనే బోర్డు స్పష్టం చేసింది. రానున్న నెలల్లో ఖాళీ సమయం చూసి లీగ్‌లో మిగతా మ్యాచ్‌లను పూర్తి చేస్తామని మాత్రం చెప్పింది. ఆ మ్యాచ్‌లు కూడా యూఏఈలో జరగవచ్చని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతానికి దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. దేశంలో కొవిడ్ పరిస్థితులను బట్టి ఏ నిర్ణయమైనా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.


# సలార్ పై సింగం 3 ఛాయలు !



'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'సలార్' కు సంబంధించి ఒక ఆసక్తికర విషయం ఇప్పుడు లీక్ అయింది. ఇప్పటికే ఈ మూవీలో ప్రభాస్ రెండు డిఫరెంట్ గెటప్స్ లో కనిపించ బోతున్నట్లుగా వార్తలు వచ్చిన పరిస్థితులలో ఈమూవీలో హీరోయిన్ గా నటిస్తున్న శృతిహాసన్ క్యారెక్టర్ కు సంబంధించిన విషయాలు కూడ బయటకు వస్తున్నాయి.తెలుస్తున్న సమాచారం మేరకు 'సలార్' లో శృతి హాసన్ జర్నలిస్ట్ పాత్రలో కనిపిస్తుందని టాక్. ఈమూవీలో ఆమె పాత్ర నిడివి చిన్నది అయినప్పటికీ ఆ చిన్నపాత్ర 'సలార్' మూవీ కథను మలుపు తిప్పే పాత్ర అని అంటున్నారు. వాస్తవానికి శృతిహాసన్ జర్నలిస్ట్ గా నటించడం ఇదే ప్రదమం కాదు గతంలో సూర్య నటించిన 'సింగం 3' లో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ గా శృతి నటించి మెప్పించిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'సలార్' మూవీలో శ్రుతి అదే తరహా పాత్రలో కనిపిస్తుంది అంటున్నారు. ఇప్పటికే ఈసినిమాకు సంబంధించిన సెట్స్ పైకి శ్రుతి రావడంతో ప్రభాస్ ఆమెకుసంబంధించిన సన్నివేశాలు ఈమధ్య చిత్రీకరించారు. వచ్చే నెల నుంచి శ్రుతి మరోసారి 'సలార్' సెట్స్ పైకి రావాల్సి ఉంది. ఆ షెడ్యూల్ లో కీలిక సన్నివేశాలు చిత్రీక రించబోతున్నారు. దీని నిమిత్తం హైదరాబాద్ చివరిలో ఒక భారీ సెట్ నిర్మాణం కూడా పూర్తి అయింది.అయితే కరోనా సెకండ్ వేవ్ పరిస్థితి పీక్ కు చేరుకొని కేవలం మూడు లక్షల స్థితికి చేరుకున్న పరిస్థితులలో షూటింగ్స్ రద్దు చేసుకోమని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి నిర్మాణ సంస్థలకు కీలక సూచనలు చేసింది. దీనితో 'సలార్' సినిమా కొత్త షెడ్యూల్ డైలమాలో పడింది అన్నవార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ప్రభాస్ 'రాదే శ్యామ్' షూటింగ్ కూడ వాయిదా పడింది అని వార్తలు వస్తున్నాయి. దీనితో ప్రభాస్ నటిస్తున్న సినిమాల సంఖ్య పెరుగుతోంది కాని ఆ సినిమాల షెడ్యూల్ ఏమి అనుకున్నవి అనుకున్నట్లుగా జరగకపోవడంతో ప్రభాస్ టెన్షన్ లో ఉనట్లు టాక్..

# బాలయ్య సినిమాలో ఫుల్ యాక్షన్ అండ్ ఫన్ !!

నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ప్రస్తుతం అఖండ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత బాలకృష్ణ అనిల్ రావిపూడి దర్శకత్వం లో సినిమా చేయబోతున్నాడని గతకొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే నందమూరి బాలకృష్ణను దర్శకుడు అనిల్





రావిపూడి కలిసి కథ ను కూడా చెప్పారట. బాలయ్య కి కూడా ఆ కథ నచ్చిందట. అందుకే అనిల్ తో సినిమా చేయడానికి బాలయ్య ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారట.అలాగే ఈ సినిమా ఫుల్ యాక్షన్ తో పాటు ఫన్ తో సాగే సినిమాగా ఉండనుందని తెలుస్తోంది. ఇక మామూలుగా అనిల్ రావిపూడి టైమింగ్, పంచ్ డైలాగ్ లు ఎలా ఉంటాయో ప్రత్యే కంగా చెప్పన వసరం లేదు. ప్రస్తుతానికి డైరెక్టర్ అనిల్ రావిపూడికి టాలీవుడ్ లో ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.





# దెబ్బతింటున్న హీరోయిన్ల సైడ్ బిజినెస్



నాలుగు చేతులా సంపాదించడం ఎలాగో ఈతరం కథానాయికలకు బాగా తెలుసు. ఓ వైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు ఆదాయాన్ని రాబట్టే అనేక మార్గాల్ని అన్వేషిస్తుంటారు. ఉదాహరణకు షాపింగ్ మాల్స్ లో సందడి చేయడం లాంటివి. మెట్రో సిటీస్‌లో షాపింగ్ మాల్స్ కి, అందులో జరిగే ఆడంబరమైన వేడుకలకు కొదవ ఉండదు. ఆర్.ఎస్.బ్రదర్స్, సౌత్ ఇండియా. ఇలాంటి మాల్స్. హైదరాబాద్ లో ఏరియాకి ఒకటి వెలుస్తుంటుంది. అందులో. హీరోయిన్లు రిబ్బన్ కటింగులు చేయడానికి, బోలెడంత ఛార్జ్ చేస్తారు. ఓ అగ్ర హీరోయిన్ షాపింగ్ మాల్ లో అడుగుపెట్టడానికి కనీసం 5 నుంచి 7 లక్షల వరకూ వసూలు చేస్తుంటుంది. ఇదంతా గంటలో జరిగే వ్యవహారం. ఈ తరహా బేరాలు కనీసం నెలకు నాలుగైనా తగిలేవి. సినిమాల్లేక ఖాళీగా ఉన్నవాళ్లకు సైతం. నెలవారీ ఖర్చులకు కావల్సినంత మొత్తం వచ్చేసేది. కనీసం లక్ష రూపాయలు చేతిలో పడితే గానీ, కాంప్లెక్స్‌లో అడుగుపెట్టరెవరూ..! ఒకటీ, అరా సినిమా చేస్తే చాలు. ఆ సినిమా హిట్టవ్వకపోయినా ఫర్వాలేదు. ఆ తరహా కథానాయికలంతా షాపింగ్ మాల్స్ పుణ్యమా అని బాగానే సొమ్ము చేసుకోగలిగారు.అయితే ఇది కరోనా కాలం. మార్కెట్లో సరైన బేరాలే లేవు. కొత్త షాపింగ్ మాల్స్ తెరుస్తున్నా - సెలబ్రెటీల్ని పిలుచుకుని రిబ్బన్ కట్ చేయించుకునేంత ఓపిక ఎవరికీ ఉండడం లేదు. పైగా. సోషల్ డిస్టెన్స్ పాటించడం ఇప్పుడు అందరి ముందున్న నైతిక బాధ్యత. సెలబ్రెటీలు వస్తున్నారంటే. గుంపులు గుంపులుగా జనం వచ్చిపడిపోతారు. వాళ్లని కంట్రోల్ చేయడం ఎవరి తరమూ కాదు. అందుకే. ఈ తరహా కార్యక్రమాలకు స్వస్తి పలికారంతా. పైగా.. సెలబ్రెటీలు వచ్చినంత మాత్రన బిజినెస్ పెరగదన్న విషయం. ఇప్పుడిప్పుడే వాళ్లకూ అర్థమవుతోంది. వాళ్ల కోసం హంగు, ఆర్భాటాల కోసం లక్షలు ఖర్చు పెట్టడం వృధా ప్రయాస అని తెలిసిపోయింది. అందుకే..ఈ బాపతు హంగామాకు చెక్ పెట్టారంతా.

# ' పవన్ ' సినిమా లో హీరోయిన్ మార్పు

మలయాళం సూపర్ హిట్ మూవీ అయ్యప్పనుమ్ కోషియుమ్ తెలుగు రీమేక్ హీరోయిన్ విషయమై మళ్లీ చర్చ జరుగుతోంది. పవన్ కళ్యాణ్ కు జోడీగా మొదట సాయి పల్లవి ని ఎంపిక చేయడం జరిగింది. ఐశ్వర్య రాజేష్ పేరు కూడా ప్రస్థావనకు వచ్చింది. సాయి పల్లవి షూటింగ్ లో జాయిన్ అవ్వబోతుందని కూడా వార్తలు వచ్చాయి. కాని సాయి పల్లవి పలు సినిమా ల్లో నటిస్తున్న కారణంగా ఆమె రీమేక్ కు డేట్లు ఇవ్వలేక పోతుందట. ఇప్పటికే ఈ రీమేక్ ను దాదాపుగా 60 శాతం పూర్తి చేశారని సమాచారం అందుతోంది. షూటింగ్ సగం కంటే ఎక్కువే పూర్తి అయిన తర్వాత ఇప్పుడు హీరోయిన్ విషయమై మళ్లీ చర్చలు జరపడం ఆశ్చర్యంగా ఉందంటున్నారు. సాయి పల్లవి ఇంకా షూటింగ్ లో జాయిన్ అవ్వలేదు. కనుక ఆమె స్థానంలో ట్యాలెంటెడ్ హీరోయిన్ నిత్యా మీనన్ ను నటింపజేస్తున్నట్లుగా తెలుస్తోంది. సినిమా లో పవన్ భార్య పాత్ర కనిపించేది కొద్ది సమయమే అయినా కూడా చాలా ప్రాముఖ్యత ఉన్న పాత్రగా తెలుస్తోంది. మాజీ గిరిజన నక్సలైట్ గా పవన్ భార్య కనిపించాల్సి ఉంటుంది. అందుకే నటిగా మంచి ప్రతిభ కనబర్చే వారిని మాత్రమే ఈ సినిమా కోసం తీసుకోవాలని భావించారు. నిత్యా మీనన్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.ప్రతిభ ఉన్న నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది. త్రివిక్రమ్ గతంలో బన్నీ సన్నాఫ్ సత్యమూర్తి సినిమా లో ఈమెను నటింపజేశాడు. దాంతో త్రివిక్రమ్ సలహా మేరకు ఈ రీమేక్ లో పవన్ కు జోడీగా నిత్యా మీనన్ ఎంపిక అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. త్వరలోనే ఆమె షూటింగ్ లో కూడా జాయిన్ అవ్వబోతుందనే వార్తలు వస్తున్నాయి.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190